
**డిశంబర్ 2011**
**సంపుటి 5**
**సంచిక 8**



**ఎడిటర్ & పబ్లిషర్**
**సందిరెడ్డి కొండలరావు**
**కాకానిపాలెం, అద్దంకి.**

Edited & Published and owned by

Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
**Saswitha Graphics**

Layout & Design
**Real image**
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

**సామాజిక రాజకీయ మాస పత్రిక**

## విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | నేనెరిగిన డా॥ దగ్గుబాటి | 2 |
| 2. | పుట్టిన రోజు వస్తుంది అందరికీ ! పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే | 9 |
| 3. | మూడు దశాబ్దాల రాజకీయ మకుటధారి | 13 |
| 4. | నేటి మేటి డా॥ దగ్గుబాటి | 17 |
| 5. | చిరంజీవ ! చిరంజీవ! డాక్టర్‌జీ! - కవిత | 22 |
| 6. | జగన్ రాజకీయ భవిష్యత్తు ఏమిటి ? | 24 |
| 7. | అవిశ్వాసంలో అంతిమ విజయం ఎవరిది ? | 28 |
| 8. | ప్రేమ, కరుణ, క్షమామూర్తికి జన్మదిన కానుక | 30 |
| 9. | మహానటి సావిత్రి | 32 |
| 10. | వాస్తుపూజ | 38 |
| 11. | తిరుక్కురళ్ - శ్రీవాణి | 40 |



గుండ్లకమ్మ,పాఠకలకు,
ప్రకటన కర్తలకు,
క్రిస్టమస్ శుభాకాంక్షలు....
ఎడిటర్ & పబ్లిషర్

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో
**"గుండ్లకమ్మ"**
**www.gundlakamma.com**

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

# నేనెరిగిన డా॥ దగ్గుబాటి



**కంచర్ల విజయభాస్కర్,**
కావలి. సెల్ : 9246492921



మల్లెపూవులాంటి మందహాసం - వేకువ వాకల మలయపవనాల పరిశుభ్రతను మించిన మనస్సు - అగాధమైన ఆంతర్యం గల గంభీరముద్ర - అనవరతం ఆత్మ విమర్శ చేసుకొంటున్నట్లుగా కన్పించే మహామౌనం – జ్ఞాన, ధ్యాన, భావనా రుషి - విద్వత్తుకు ఊపిరి పట్టు - విడిసినచోటు విశ్వవిద్యాలయం – ఒక్కోసారి స్తబ్ధత అనే తిమిరంపై తిరుగుబాటు చేసే రవికిరణం – నవలోకాన్ని కాంక్షించే దార్శనికతకు ప్రతిరూపం – నిరాడంబరత జీవన శైలికి ప్రతీక .... అయితే ఆ మ్రోగే మౌనశంఖం మరెవరో కాదు. ఈ రాష్ట్ర ప్రజలందరికి బాగాసుపరిచితుడైన డా॥ దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ఆయన పుట్టినరోజు డిసెంబరు **14**ను పురస్కరించుకొని తన **59**వ జయంతికి ప్రత్యేకంగా రూపొందించిన ఈ వ్యాసాన్ని పాఠకలోకానికి అందిస్తున్నాం.



దగ్గుబాటి అనే జగజ్జనుడిని గుర్చి చెప్పడానికి దజన్లకొద్ది వ్యాసాలు కూడా చాలకపోవచ్చు. అయితే ఐదంటే, ఐదే విశేషణాలు చాలు. ఒంటరివాడు - చంటిపిల్లాడు - హృదయమొక్కటే ఉన్నవాడు - అణుకువలోనే అహం కల్గినవాడు - అసామాన్యుడైన సామాన్యుడు.

1982 మార్చి చివరి రోజులలో పార్టీ ఆవిర్భావానికి ముందు నుంచి 1995 ఆగష్టు సంక్షోభంవరకు రాష్ట్రంలో వందలాది మంది రాజకీయ నాయకులను తయారు చేసిన చరిత్ర ఆయనది. అందుకే ఆయనను గొప్ప ఖర్ఖానా అనవచ్చు. కార్యకర్తలను గుర్తించడం. వారి శక్తిసామర్థ్యాలను పరిశీలించడం. యన్.టి.ఆర్. దృష్టికి తీసుకెళ్ళడం, నాడుఆయనకు నిత్యకృత్యంగా ఉండేది. నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలలో ఆయన తయారుచేసినవారు కీలకపాత్రలు పోషించే స్థాయిల్లో చెలామణి అవుతున్నారంటే అది ఆయనచేతి చలువేని చెప్పాలి. వారిలో కొందరు ఆయా పార్టీలలో నాయకులుగా వుంటే, మరికొందరు యం.యల్.ఎ.లుగా, యం.పి.లుగా,మంత్రులుగా వ్యవహరిస్తున్నారు.

> యన్.టి.ఆర్. హయాంలో ఆయన తర్వాత అంత సచ్ఛీలుడుగా రాష్ట్ర ప్రజలలో ఆయనకు గుర్తింపు ఉండేది. అందుకేనేమో 1995 సెప్టెంబరులో నాయకత్వ మార్పిడి సమయంలో మాజీ ప్రధాని విశ్వనాథ ప్రతాప్‌సింగ్, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈయన పేరు తెరమీదకు తీసుకొచ్చారు. అయితే, ఇచ్చిన మాటకు కట్టుబడే ఆయన నైజం... ఆయన రాజకీయ జీవితానికి ఆశనిపాతంగామారింది. ఆ సమయంలో ఏమాత్రం యుక్తియుక్తంగా ఆయన వ్యవహరించి వుంటే... కథమరోలా ఉండేది. ముఖ్యమంత్రి పీఠం కాస్తా ఆయనకు దక్కి వుండేది.

అసలు మొదటి నుండి ఆయనది పోరుబాటే కాని పవరు బాటకాదు. నాటికీ, నేటికీ వినాయకుడే పవర్ పాలిటిక్స్ కు స్ఫూర్తేమో- విఘ్నాధిపత్యం విషయంలో అర్ధనారీశ్వరులైన తల్లిదండ్రుల పరీక్ష నెదుర్కోవడానికి, సుబ్రహ్మణ్యుడు లోకసంచారానికి బయలుదేరితే, పవర్ టెక్నాలజీ తెలిపిన వినాయకుడు - మాతాపితల చుట్టూ పరిభ్రమించి, వారిని నివ్వెరపరిచేలా చేసి, ఎలాంటి శ్రమదమాదులు లేకుండా - విఘ్నాధిపత్యం కొట్టేసినట్లుగనే- అధికార రేసులో ఆనాడు దగ్గుబాటికి సుబ్రహ్మణ్యస్వామి లాంటి పాత్ర మాత్రమే దక్కింది.

చదివిన వైద్యశాస్త్రం ప్రకారం - రోగుల నాడి చూడాల్సిన డాక్టర్ - సమాజానికి చికిత్స చేయాలనేతలంపుతో ... బృహత్ ఆశయంతో రాజకీయ ఆరంగేట్రమ్ చేశాడు. దేశభక్తి, సేవానిరతి, నిజాయితీ, నిరాడంబరత నిలువుటద్దాలై రాజకీయ ప్రస్థానం ఆరంభించాడు.

1984న మార్టూరు ఉప ఎన్నికతో ప్రారంభమైన ఆయన జైత్రయాత్ర 2009 శాసనసభ ఎన్నికల నాటికి పర్చూరుతో పాతికేళ్ళు అప్రతిహటంగా సాగింది. ఈ మధ్యలో ఒకసారి బాపట్లలోక్‌సభకు - మరోసారి రాజ్యసభకు ఎన్నికై - ఎన్నికల కురుక్షేత్రంలో వరుస విజయాలు సాధించారు.

ఇరవై అయిదున్నర సం॥లుగా ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఇప్పటిదాకా ఓటమి ఆయన నిఘంటువులో లేదని చాటుకొన్నారు.

లోక్‌సభ సభ్యునిగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగించే అవకాశం దక్కించుకున్నాడు. పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా కేంద్రరాజకీయాల్లో కీలకమైన నిర్ణయాలలో ఆయన ప్రముఖ పాత్ర పోషించాడు. ఎస్టిమేట్స్ కమిటి సభ్యునిగా, అండమాన్‌దీవులను సందర్శించే అవకాశం లభించినప్పుడు – ఈనాడు దినపత్రికకు – భారత సంస్కృతిలో ఒకపాయ అండమాన్ అని ఆయన వ్రాసిన వ్యాసం – ఆదివాసీల పరిస్థితులను కళ్ళకు గట్టినట్లైంది. తానా సభలకు అమెరికా వెళ్ళినా, ప్రపంచయువజనోత్సవాలకు – తెలుగుయువత అధ్యక్షుని హోదాలో అగ్రరాజ్యాలైన రష్యా, చైనాలను దర్శించినా, వాటిని గూర్చిన లోతైన అధ్యయనంతో, వివిధ ప్రసిద్ధదినపత్రికలలో ఆయన విరచించిన వ్యాసాలు ఎంతో కనువిప్పు కలిగిస్తాయి.

వైద్యమంత్రిగా పనిచేసే సమయంలో గ్రామీణ జనాభా తేలుకాట్ల బారి నుండి రక్షణ పొందడానికి, **'ద్రోణి'** అనే హోమియో మందును అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు – ఉపకేంద్రాలకు పంపిణీ చేయించి ఉపశమనం పొందడానికి చర్యలు తీసుకున్నాడు. ఈ సమయంలోనే నేడున్న వైద్య విధానపరిషత్తు – ఏరియా వైద్యశాలలకు అంకురార్పణ గావించాడు.


పత్తిరైతుల దయనీయస్థితిని తొలగించడానికి, దళారీ వ్యవస్థకు పోటీగా కాటన్ కార్పోరేషన్ సంస్థ ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరిపించి, గిట్టుబాటు ధర దక్కేలా అనేకపర్యాయాలు కృషి చేశాడు. పొగాకు రైతుల కడగండ్లను చూసి చలించిన ఆయన టుబాకోబోర్డు లో గుత్తేదారుల ఆటకట్టించడానికి పోటీగా – పొగాకు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఏర్పాటు చేసి దానికి మూలధనం ఏర్పాటు చేయించి, రైతులోకాన్ని ఆదుకున్న చరిత్ర కూడా ఆయనకుంది. అనేక ఎత్తిపోతల పథకాలను కూడా రూపొందించారు.

ఇంకొల్లు పరిసరాలలో ఆయన, అనేక విద్యాసంస్థలు స్థాపించాడు పేదపిల్లల విద్యావ్యాసంగానికి ఆయన యిచ్చిన చేయూత మిక్కిలి ఉదారమైనది. కాలేజీ సీట్లు... హాస్టల్ సీట్లు దేశవ్యాప్తంగా ఇప్పించి విద్యాగంధం వెదజల్లాడు. తన సంస్థల్లోనే గాకుండా, అనేక ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో ఎందరో యువతీయువకులకు జీవనోపాధి చూపించి వారి బ్రతుకుదీపం వెలిగించాడు.

## మనిషి పోయినా మమత పోదు
## యన్.టి.ఆర్.మృతి వల్ల స్మృతులు చెరిగిపోవు

యన్.టి.ఆర్. అభిమానులు, కృష్ణుడి రూపంలో ఆయన విగ్రహాన్ని విశాఖ నగరంలో పురందేశ్వరి చేత ఆవిష్కరింపజేస్తే, స్వగ్రామమైన కారంచేడులో మరో కృష్ణుడి విగ్రహాన్ని ప్రసిద్ధనటులు బాలకృష్ణ, జూనియర్






యన్.టి.ఆర్. ఇతర కుటుంబ సభ్యులచేత దగ్గుబాటి దంపతులు యన్.టి.ఆర్. పుట్టినరోజున ఆవిష్కరింపజేశారు. ఆ సందర్భంగా, ఎంతోమంది కళాకారులను, ఉత్తమ రాజకీయ వేత్తలను సత్కరించి తమ సంస్కారాన్ని చాటుకున్నారు.

ఆ రోజుల్లో దగ్గుబాటి పేరు చెప్తే యువతరం కేరింతలు కొట్టేది. రాష్ట్ర తెలుగుయువత చరిత్ర లోనే కాదు, ఏ పార్టీ యువజన విభాగంలోనైనా, ప్రధాన పార్టీని తలపించే స్వేచ్ఛా, స్వాతంత్ర్యం. ఈ అనుబంధ యువజన విభాగానికి ఉండేవి. ఇందుకు కారణం తెలుగు యువత సారధి దగ్గుబాటి కావడమే.

స్వంత ప్రభుత్వం అధికారంలో ఉంటే – భోగస్ రేషన్ కార్డులు ఉన్నవని ఉత్తరాంధ్ర పర్యటనలో బహిరంగంగా చాటిన ధీశాలి ఆయన. రాష్ట్రపర్యటనల్లో అనేకసార్లు అనేక అంశాల మీద ఇలాంటి ప్రకటనలు చేశాడు. తత్ఫలితంగా పార్టీ అంతర్గత సమావేశాల్లో తనపై విమర్శలు వెల్లువెత్తినా, ప్రభుత్వ శీలాన్ని యన్.టి.ఆర్. వ్యక్తిత్వాన్ని కాపాడడానికి ఆయన తన భవిష్యత్ కోసం సద్విమర్శలు చేయడానికి ఏమాత్రం వెనుకంజవేయలేదు. దగ్గుబాటి నేతృత్వంలో పనిచేయడానికి ఆయన దృష్టిలో పడడానికి – వయస్సు మీరిన వారుకూడా తెలుగు యువతలో చేరడానికి పోటీపడేవారంటే అతిశయోక్తి కాదు. యన్.టి.ఆర్. స్థాపించిన 'తెలుగుదేశం' లో యువజన విభాగానికికున్న గొప్పతనం అది. జవ, జీవాలు కలిగిన యువజన విభాగం ఏదన్నా ఉందంటే, అది దగ్గుబాటి అధ్యక్షత వహించిన 'యువత' విభాగమేనని అందరూ అంటారు. పార్టీ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా పలువురు నేటికీ కొనియాడుతుంటారు.

అప్పటి వరకు హైదరాబాద్ నగరంలో రామకృష్ణా సినీ స్టూడియో లోనో, కర్మన్ ఘాట్ పరిసరప్రాంతాల్లోని పంక్షన్ హాళ్ళలో జరిగే పార్టీ శిక్షణా తరగతులను, సిటీ వెలుపల – రాష్ట్ర స్థాయిలో చరిత్ర ప్రసిద్ధిచెందిన – కాపూరు వినయాశ్రమంలో మారుమూల గ్రామీణ ప్రాంతంలో సజావుగా జరిపించిన వినూత్న శైలివారిది. 1989మే నెలలో యన్.టి.ఆర్. 67వ జన్మ దినోత్సవాన్ని యువజన క్రాంతి యాత్ర గా 5 లక్షల మంది యువకులతో హైదరాబాద్ కదం తొక్కించిన నిర్వహణా దక్షత ఆయనది.

ముప్పైకి పైగా, విద్యార్ధి యువజన సంఘాలను సమైఖ్యపరచి, కేపిటేషన్ ఉద్యమాన్ని ఊపుచేస్తున్న సమయంలో, ఒకవైపు తీవ్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిఘటన ఎదురవుతుంటే, మరోవైపు పార్టీలో ఆయన ప్రాభవాన్ని అడ్డుకొనేందుకు, ఇతరులు చేసిన ప్రయత్నాలను ఖాతరు చేయ్యకుండా ఆయన సాగించిన ఉద్యమం నెదురుమల్లి ప్రభుత్వాన్ని పడగొట్టింది. ఉద్యమలక్ష్యాన్ని నెరవేర్చింది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను దరిచేర్చింది. 1995 శాసనసభ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చడానికి ఈ ఉధ్యమం బాగా ఉపయోగపడింది అనుటలో ఎలాంటి సందియంలేదు.

అయితే పార్టీలో ప్రభుత్వంలో ఆయన పడ్డకష్టం – శ్రమ, ఎంతోకాలం నిలువలేదు. షుమారు పదమూడున్నర ఏడాదులు రాష్ట్ర, దేశ రాజకీయాలలో అధిష్టాన నాయకుడిగా తీవ్ర



ప్రభావాన్ని చూపిన దగ్గుబాటి 95 ఆగస్టు సంక్షోభానంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో బాగా వెనుకబడిపోయాడు. ఊపిరి సలుపని మంత్రాంగం, యంత్రాంగం నడిపిన దగ్గుబాటి ఆ సంఘటనలతో విసుగుచెందాడు. కలత చెందాడు. 1995 సెప్టెంబరులో పార్టీ నుండి బయటకు రావలసిన దుస్థితి ఏర్పడింది. ఎంతో పశ్చాత్తాప హృదయంతో 17 మంది శాసనసభ్యులను వెంటబెట్టుకొని యన్.టి.ఆర్. గూటికి చేరాల్సి వచ్చింది. ఆచితూచి, సుదీర్ఘంగా ఆలోచించి, సమయం తీసుకొని నిర్ణయాలు గైకొనే ఆయన నైజం కాస్తా కూడా, తన ప్రకృతికి విరుద్ధంగా జరిగినప్పుడు తాను పడ్డ బాధ వర్ణనాతీతం. ఆత్మక్షోభ తట్టుకోలేని దగ్గుబాటి ఒక చరిత్ర – కొన్ని నిజాలు పేరుతో వ్రాసిన గ్రంథంలో క్షమించరాని తప్పు చేశానని తన అంతరంగాన్ని అందులో ఆవిష్కరించాడు. యన్.టి.ఆర్. తర్వాత పార్టీలో తప్పును తప్పుగ ఒప్పుకునే ధైర్యం ఆయన కొక్కడికే ఉండేది. చివరికి తన ఉనికి ప్రశార్థకం అయిందనుకున్నప్పుడు శాఖా చంక్రమణం చేయడానికి వెనుదీయలేదు. అక్కడా అవస్థలు తప్పలేదు.

ఒకనాడు ఏ దగ్గుబాటి పిలుపిస్తే 23 జిల్లాల నుండి కెరటాలు – కెరటాలుగా యువత కదిలివచ్చిందో అట్టి ఆయన శక్తి సామర్థ్యాలకు తగినంత కీర్తి–పదవులు లభించలేదనేది అందరిలో వున్న అంతర్మథనం. అందుకు తెరతీస్తూ 2010 సం॥లో యన్.టి.ఆర్.పుట్టిన రోజు. కారంచేడులో జరిపిన కృష్ణుడి రూపధారణలో వున్న యన్.టి.ఆర్. విగ్రహావిష్కరణ సభకు రాష్ట్రం నలుచెరగుల నుండి వచ్చిన కేడర్ అందుకు దృష్టాంతం. పార్టీ వివక్షలు – ప్రాంతీయ కక్షలు లేని యన్.టి.ఆర్. కాలం నాటి వైభవం ఆ సభ సంతరించుకొన్నది. మినీ ఆంధ్రప్రదేశ్‌ను నాటి సమావేశం తలపింపజేసింది.

**గొంతు–గొంతు కలుపుదాం**
**గంతులేస్తూ సాగుదాం**
**నడుంకట్టి చాటుదాం**
**తెలుగుతల్లి ఒక్కటే.. ఒక్కటే** అని పాడుదాం

అన్నట్లుగా వుంది ఆ సన్నివేశం చూసేవారికి.

మధ్యలో కొడిగొట్టిన రాజకీయ దివ్వెను వెలిగించుటకు ఎంతోకాలం పట్టలేదు ఆయనకు. పురందేశ్వరి రూపంలో సతీమణి ద్వారా ఆయన చేసిన ప్రయోగం విజయవంతమయ్యింది. సత్యభామను తెచ్చాడని అందరూ సంబరపడ్డారు. ఆనాడు యన్.టి.ఆర్.చేత పార్టీ పెట్టించి, ఒక చారిత్రక అవసరానికి ఎట్లా అనాడు దోహదబడ్డాడో... సరైన సమయంలో తన అర్ధాంగి అయిన యన్.టి.ఆర్.కుమార్తె పురంధేశ్వరిని రాజకీయాల్లోకి తెచ్చి పూర్వ వైభవానికి ధీటుగా రాణింపచేయడం లోనే ఆయన రాజకీయ చాతుర్యం అర్ధమవుతుంది. ఇది వర్తమాన చరిత్ర నడుస్తున్న చరిత్రలో వారిద్దరి పాత్ర సర్వులెరిగినదే.

### యత్రనార్యస్తు పూజ్యంతే... రమంతే తత్రదేవతాః అన్న సూక్తిలా

అర్ధాంగిని రాజకీయాల్లోకి దెచ్చి – తాను లో ప్రొఫైల్ మెయిన్‌టెన్ చెయ్యడంలో

ఆయన చూపిన సౌహార్థ్రత రాజకీయ విజ్ఞత కనబడుతుంది. అంతరంగంలో అల్లుకున్న పూలతావి గుభాళిస్తుంది.

ఏడున్నర సంవత్సరాల నాడు, కాంగ్రెస్‌లో ప్రవేశించకముందు, తెలుగుదేశం లో చేరాలన్న ప్రజల అభిమతాన్ని గమనించి గౌరవించి, పునరాగమనం కోసం ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మెకాలడ్డేవారు ఎక్కువైనారు. యన్.టి.ఆర్. దగ్గర ఒక్క అధికార కేంద్రం చాలంటే చాలు అని చెప్పనివారు... తమదాకా వచ్చేటప్పటికి అభిప్రాయాలు మార్చారు. ఒక్కటే అధికార కేంద్రం ఉ ండాలంటే... దగ్గుబాటి లాంటివారు ఉ ండకూడదన్నారు. కలలో కూడా ఆయన్ను సహించలేకపోయారు.

ఎవరైతే స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, బుద్ధుడు, మహావీరుడు, జీసస్, క్రీస్తు అబ్రహం లింకన్ మార్టిన్ లూథర్ కింగ్, మహమ్మద్ ప్రవక్త, నానక్, లోక్‌నాయక్ జయప్రకాశ్, డా॥ రామ మనోహర లోహియా, బోస్, భగస్‌సింగ్, సీతారామరాజు, ప్రొఫెసర్ రంగా, చరణసింగ్, చంద్రశేఖర్, యన్.టి.ఆర్., కారల్ మార్క్స్, లెనిన్, మావోల స్ఫూర్తి నింపుకొని రాజకీయాల్లోకి వచ్చి సమసమాజం కోసం పరితపిస్తున్నారు. పేద ప్రజలకు అండగా వున్నారో - సర్కారుతో పనిగాక సతమతమవుతున్న వారిని చేరదీసి, వారి సమస్యలను ఆకళించుకొని అందుకనుగుణంగా నిత్యం, చీటీలు, ఉత్తరాలు ఫోనులు చేసి వారి వదనాల్లో ఆనందం నింపుతున్నారు. ఎవరైతే వేలాది మంది యువతీయువకులకు ఉ పాధిపరంగా కామధేనువుగా వున్నారో ఎవరైతే కర్షకలోకం కళ్ళల్లో చేనేతకారుల బ్రతుకుల్లో వెలుగులకై తపిస్తున్నారో... తుఫానులు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ బాధితుల సత్వర సహాయానికై ముందుకొచ్చారో.. ఎవరైతే సొంత నియోజకవర్గమైన పర్చూరుకు ఆయాసం॥లో 150 నుండి 250 కోట్ల బడ్జెట్‌ను అభివృద్ధికి ఏటేటా తరలించుకుపోయారో ఎవరైతే నెదర్లాండ్స్ పథకాల ద్వారా త్రాగునీటి సమస్యను దీర్చి మధుర జలాలను అందించారో... ఎవరైతే మరుగునీటి సమస్య తీర్చి రహదారుల అభివృద్ధికి పరిశ్రమల



ప్రగతికి పాటుబడ్డారో.. ఎవరి నేతృత్వంలో రాజకీయాల్లో సమాజాన్ని మరమ్మత్తు చేసి మరుమల్లెలమనిపించుకోవాలనుకున్నారో వారందరి మీద సమ్మెట దెబ్బలా ఆయన రాజకీయ జీవితానికి శాశ్వత గ్రహం పట్టించాలనుకొన్నారు. ఈ వైఖరికి ప్రజలు విస్తుపోయారు.

ఒకనాడు పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ముఖ్యుడైనవానికి, ప్రగతిశీల యువనేతకు జరిగిన అపకారానికి ప్రజానీకంలో సానుభూతి వెల్లువెత్తింది. అలా జరిగిన అనేక సంఘటనల పూర్వపదాల్లో కాంగ్రెస్ ప్రవేశం అనూహ్యంగా జరిగింది. 1982 నుండి 1995 ఆగస్టు సంక్షోభంవరకు రాష్ట్ర రాజకీయ చరిత్ర మలుపుల్లో ఆయన పాత్ర అత్యంత కీలకంగా పరిగణించాలి. అందువల్ల ఆయనను చరిత్ర నుండి విడదీసి చూడలేని పరిస్థితిగా పేర్కొనాలి.

కాంగ్రెస్‌లో ఆ కుటుంబానికి 1960-70 దశకాల నుంచి మంచి సంబంధబాంధవ్యాలుండేవి. అప్పట్లో ఆయన విద్యార్థిగా టీనేజ్ కుర్రాడుగా ఉన్న రోజుల్లో తండ్రి చెంచురామయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉండేవారు. రొండా నారపరెడ్డి-వీరు, సమోధ్యగా రాజకీయాలు నడిపేవారు. నాటి ముఖ్యమంత్రులు కాసుబ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి లాంటి ఉద్దండులైన రాజకీయవేత్తలు కారంచేడులో వారి స్వగృహానికి వస్తుండేవారు. ఇంకా అనేకమంది జాతీయ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అరుదెంచిన గృహమది.

అయితే వియ్యంకుడు రాజకీయ పార్టీ ఏర్పాటు చెయ్యడంతో చెంచురామయ్యగారికి విధిలేని వ్రతభంగమయింది. ఇలా రాజకీయ పరమపదసోపానపటంలో డా॥ దగ్గుబాటి ఒకనాడు తండ్రి అనుసరించిన కాంగ్రెస్‌లోకి యాదృశ్చికంగా ప్రవేశించాల్సివచ్చింది.

రాజకీయాల్లో నిమ్నోన్నతాలు చూసిన దగ్గుబాటి తండ్రిని పోగొట్టుకోవాల్సిన దుర్భరపరిస్థితి కూడా ఏర్పడింది. ఒక ఉ గాదినాడు స్వగృహంలో ఆయన కాల్చి చంపబడ్డాడు. సౌమ్యుడిగా, పెద్ద మనిషిగా పేరొందిన చెంచురామయ్య చేసిన నేరమల్లా యన్.టి.ఆర్.కు వియ్యంకుడు కావడం. కుమారుడు అగ్రశ్రేణి రాజకీయవేత్తగావడమే కారణాలయినవి. దోషులు ఎవరని తెలినా, హంతకులను పెద్ద మనస్సుతో క్షమించిన వైనాన్ని ఎందరో నేటికీ చెప్పుకుంటుంటారు.

'డబ్లిన్' నగరాన్ని వదలిన జేమ్స్ జాయిను లాగా ... స్వగ్రామం కారంచేడుపైన మమత వీడలేని చెక్కుచెదరని అభిమానం ఆయనది. సువిశాల ప్రాంగణంలో చల్లని చెట్ల నీడలో ఆయన నిర్మించిన కుటీరం పర్ణశాలను బోలివుంటుంది. సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటుంది. పుట్టమట్టితో నిర్మించిన గోడలు. రెల్లు గడ్డితో వేసిన పైకప్పు - వెదురు బొంగులకూసాలు - వాసాలు - గోవు పేడతో అలికించిన వెదురు తడికలు - మెంతులతో అద్దిన దర్వాజాలు, కిటికీలు - తీర్చిదిద్దిన రంగవల్లులతో త్రేతాయుగం నాటి పంచవటిని తలపిస్తుంది. ఎంతో ఆహ్లాదపరిచే ఆ వాతావరణంలో ఆయన ప్రముఖులు- ప్రబుద్ధుల తోను- సమస్యల తో వచ్చే

వారందరినీ అక్కడే చేరదీస్తాడు. అక్కునచేర్చుకుంటాడు. సమస్యలు వింటాడు. పరిష్కారాలు కనుగొంటాడు. అక్కడే తన తల్లి పర్యవేక్షణలో పరిచారక సిబ్బంది వచ్చిపోయే జనాలకు ఏ సమయానికి ఏమేమి ఇవ్వాలో - ఏమేమి పెట్టాలో దగ్గరుండి చేస్తుంటారు. మానవసేవే-మాధవసేవ కదా అన్న తృప్తితో తల్లి రమాదేవిగారు కొడుకు రాజకీయ ఉన్నతికి ఈ వృద్ధాప్యంలో కూడా నిరంతరం తపిస్తుంటుంది. అలా దగ్గుబాటి నివాసం, కారంచేడులో వచ్చిపోయేవారికి సూదంటు రాయిలా మారింది.

ఆయనకు ఎందరో మిత్రులు దేశ, విదేశాల్లో ఉన్నారు. వారితో కలసి విజ్ఞాన వినోద ప్రదేశాలు - పుణ్యక్షేత్రాలు-తీర్థాలు పర్యటిస్తుంటారు. అప్పుడప్పుడు విదేశీయాత్రలు కూడా ఉంటాయి. వాటిల్లో భాగంగా - అమర్‌నాథ్‌యాత్ర చేసినప్పుడు యాత్రా విశేషాలతో స్థలపురాణంతో పుస్తకం కూడా వ్రాశారు. ఈ యాత్ర సమయంలో మంచు లింగాల్ని దర్శించను గాడిదలు - గుర్రాలపై వెళ్ళకుండా, వాయి మార్గంలో హెలికాప్టర్ ద్వారా కూడా వెళ్ళకుండా, నడుస్తూనే వెళ్ళారు. తిరుమల శ్రీవారిని కూడా ఏడుకొండలు ఎక్కి దర్శించుకోవడం దగ్గుబాటి గారికున్న భక్తిప్రపత్తులను నిష్టను తెలియజేస్తుంది. ఆఖరుసారిగా నవంబరు చివరి వారంలో 30మందితో బస్సులో కోటప్పకొండ-రామాపురం బీచ్, హాయ్‌లాండ్ మున్నగు ప్రదేశాలను చూడడానికి వెళ్తూ పనిలోపనిగా కారంచేడు కూడా వారికి చూపించి మధురమైన విందు ఏర్పాటు చేశారు.

వారి ప్రసంగాలలో పిట్టకథలు, సామెతలు, ఆమెతలు నిండుగా వుంటాయి. హాస్యం లాస్యం తొణికిసలాడుతుంది. చురకలతో కూడిన ప్రసంగం చెయ్యడంలో వారిది అందెవేసిన చేయి. అలా ఆద్యంతం రక్తికట్టించేలా, సందేశాత్మకంగా ఉత్తేజపూర్వకంగా ప్రసంగాన్ని వినిపించి శ్రోతలను మంత్రముగ్ధులను చెయ్యడం ఆయనకున్న అలవాటు.

చారిత్రక గ్రంథాలు వెలువరించడంలో దగ్గుబాటి ఎంతోదిట్ట. ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై స్పందించడం. గ్రంథాలు వ్రాయడం క్షణం తీరిక లేని రాజకీయులకు సాధ్యమయ్యేపనికాదు. అయినా ఆ పని దగ్గుబాటి చేస్తాడు. ఎంతో వైచిత్రితోను, విన్నాణముతోను, ఆయన శైలి రచనలలో కనపడుతుంది. అసలు చరిత్ర పరిశోధకుని కుండవలసిన నిష్పాక్షిక బుద్ధి, తర్కశక్తి బహుభాషా విషయాలను గూర్చియో గాక అనేక యితర విషయాలను గూర్చి కూడా విలువ గల వ్యాసాలను అనేక సమయాలలో ప్రకటించియున్నాడు. ఏ విషయమును గూర్చి వ్రాసినను అది పరిపూర్ణముగా నుండుట ఆయనవిశిష్టత. సమగ్రతకు సరళతకు ఆయన వ్యాసములు - గ్రంధములు ఉదాహరణములు. వర్తమాన రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తెలుగు జాతిని మేల్కొల్పుటకై ఆయన వ్రాసిన తెలుగు వారి చరిత్ర, వేర్పాటు వాదం క్రీ.పూ.300 నుండి క్రీ.శ.210 వరకు గ్రంథము ఇప్పటి తాజా రాష్ట్ర పరిస్థితులకు ఎంతో అనువైనది. ఈ గ్రంథంలో చరిత్రలోని అనేక విషయాలను పరిశోధించి బహిర్గతమొనరించారు. అలాగే ఒక చరిత్ర-కొన్నినిజాలు గ్రంథం కూడా ఇది బహుభాషల్లో ప్రకటితమైంది. 1982 నుండి 1995 పరిణామాల వరకు సాగిన ఈ రచన ఆధునిక ఆంధ్రరాష్ట్ర రాజకీయ చరిత్రకు ప్రతిబింబం. ఇంకా ప్రపంచతత్వం - నాయకత్వం (రాజనీతి) క్రీ.పూ.470 నుండి క్రీ.శ.210 వరకు వ్రాసిన గ్రంథం ఎంతోమంది మేధావులను, విద్యార్థులను, ఆచార్యులను ఆకట్టుకుంది. వండివార్చి వడ్డించినట్లుగా ఉండేవారి గ్రంథాలు పాఠకుల మన్నన పొందుతున్నాయి. ఇవి పునర్ముద్రణలకు నోచుకుంటున్నాయంటే, పాఠకలోకంలో ఆ గ్రంథాలకున్న ప్రాముఖ్యత వెల్లడవుతుంది. ఆయన ఇల్లే పెద్ద గ్రంథాలయమంటే అతిశయోక్తికాదు. తన పర్యటనలలో అనేక గ్రంధాలు సేకరించడం ఆయనకున్న అలవాటు. మంచి గ్రంథం చూస్తే ఆయనకు ప్రాణం లేచివస్తుంది. అనేక గ్రంథాలు ఆయన రాక్స్‌లో అలమరల్లో, బీరువాల్లో చిమట ఉండలతో భద్రంగా అద్దాలతలుపులతో దాగి వుంటాయి. తాను చదవాలనుకున్న పుస్తకం కన్పించినప్పుడు ఆయన మనిషి మనిషిగా ఉండడు. అంతటి సరస్వతీపుత్రుడాయన. ఆటవిడుపుగా అనేక వ్యాపకాలు కూడా ఉన్నాయి. వ్యాయమం-ఈత-షటిల్-పుస్తక పఠనంతో బాటు - రాహుల్ సాంకృత్యాయన్ లా విస్తృతయాత్రికుడు - కూడా. సినిమాలు కూడా నిర్మించిన చరిత్రుడు. యన్.టి.ఆర్., ఎ.యన్.ఆర్. శ్రీదేవి లాంటి అగ్రనటులతో జానపద, సాంఘిక చిత్రాలు నిర్మించారు.

సుప్రసిద్ధకవి, రచయిత నాగభైరవ కోటేశ్వరరావుకు, యన్.టి.ఆర్. నిర్మించిన 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమాకు రచయిత అయ్యే భాగ్యం కలిగించారు. స్టూవర్టుపురం గజదొంగల చోరవృత్తిని మాన్పించి, వారిలో పరివర్తన తేవడానికి ఆయన చేసిన కృషి ఆనాడు ప్రజల, పత్రికల ప్రశంసలందుకొన్నది. లోక్‌నాయక్ జయప్రకాష్ చంబల్ బందిపోట్లను చరిత్ర తర్వాత ఆ కోవలో సంఘ సంస్కరణకు పూనుకొన్న వారిలో దగ్గుబాటి రెండోవారు.

స్వాతంత్ర్య సమరయోధులంటే ఆయనకెంతో ప్రీతి. భగత్‌సింగ్ సహచరుడు, ప్రసిద్ధ విప్లవకారుడు విజయకుమార్ సిన్హా హైదరాబాద్‌లో వృద్ధాప్యంలో మరణిస్తే - నాటి ముఖ్యమంత్రి యన్.టి.ఆర్.ను తీసుకొని వెళ్ళి ఘనంగా నివాళులర్పించి వచ్చారు. దేశభక్తులంటే ఆయనకున్న వల్లమాలిన అభిమానానికి పరాకాష్టగా తనకుమార్తెకు నివేదిత అని నామకరణం చేసి తన ముచ్చట తీర్చుకున్నాడు.

తన ఉన్నతికి మార్గదర్శకుడైన తండ్రి మరణం - ఒక్కగానొక్క తమ్ముడి వాహన ప్రమాద మరణం తట్టుకోలేని దగ్గుబాటి - తనకుమారునికి వారిద్దరి పేరు కలిసొచ్చేలా నీలమోహన్ చెంచురామ్ అని పేరుపెట్టి తన వినయాన్ని వాత్సల్యాన్ని వారి పట్ల ప్రకటించుకున్నాడు.


చివరిగా చెప్పవచ్చేదేమిటంటే వారి ప్రతిభకు పాఠవానికి, శ్రమకు - శక్తికి తగినంత అవకాశాలు గాని- కీర్తి ప్రతిష్టలుగానీ వారికి దక్కలేదనేది యదార్థం. అయితే, గద్దెమీద, గరికమీదా సమాన ఠీవితో కూర్చొగలిగిన ప్రాప్తకాలజ్ఞాతవారిలో ఉంది. గనుకనే ఆదర్శరాజకీయ వాదిగా, చరిత్రపుటలలో నిస్సందేహంగా మిలిగిపోతారు.

******

# పుట్టినరోజు వస్తుంది అందరికీ! పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే!



- పాతూరి వెంకటేశ్వరరావు
సెల్ : 9849081889



మనకు తెలిసినంత వరకు ఈ విశాల విశ్వంలో ప్రాణికోటికి జన్మనిచ్చింది ఒకే ఒక అమ్మ. ఆమే భూమాత. ఆ తల్లి చిట్టచివరి అందాల ముద్దు బిడ్డగ, మనిషిగ జన్మించడం... ఓహ్ నిజంగా మనిషికి దేవుడిచ్చిన గొప్పవరం. (జీవరాశి పరిణామంలో ఇప్పటికీ మనిషిదే చివరి పరిణామం) కోట్లాది సంవత్సరాలుగా పలురకాల ప్రాణుల్ని ప్రసవిస్తున్న భూమాత, అవన్నీ తన ఆశయాన్ని నెరవేర్చలేవేమో నన్న అనుమానంతో కాబోలు, తన ఇచ్ఛను నెరవేర్చగల సమర్థుడైన బిడ్డకోసం తపించి, తపించి తుదకు కొన్ని లక్షల సంవత్సరాల క్రితం మనిషిని ప్రసవించింది పుడమితల్లి. అంతేకాదు, 'మిమ్మల్ని, నన్ను, మనందరినీ కాపాడుకోగల సమర్థుడు మీ చిట్టితమ్ముడు మనిషి. వీణ్ణి కంటికి రెప్పలా కాపాడుకుందాం. మనం మనిషిని కాపాడుకుంటే, మనిషి మనల్ని కాపాడుతాడు. అంటూ 'ధర్మో రక్షతి రక్షితః' అన్నంత దృఢ విశ్వాసంతో తక్కిన తన సంతానాన్ని ఆదేశించింది భూమాత.

నాటి నుండి 'నా సంతానంలో కెల్లా తెలివి, విచక్షణ, సృజనాత్మకత గల బిడ్డ మనిషి. వీడు తప్పక నన్ను, నా సమస్త సంతానాన్ని పది కాలాలపాటు పదిలంగా కాపాడుకుంటూ నన్ను ప్రగతి పథాన నడిపించగల ధీశాలి. నా ఖ్యాతిని గ్రహాంతరాలలో, గెలాక్సీలలో విస్తరింపజేయగల బలశాలి. ఈ మనిషే నా ఆశాజ్యోతి అంటూ భూమాత పదే పదే మురుసుకుంటున్న ముద్దుబిడ్డలు, మన మానవులమే సుమా!

భూమాత ఆదేశించినట్లే, చెట్లన్నీ బొగ్గుపులును వాయువును పీల్చి, ప్రాణవాయువును విడుదల చేస్తూ వాతావరణాన్ని చల్లబరచి వర్షాలు కురిపిస్తున్నాయి. నదులన్నీ ప్రవహిస్తూ సాగుత్రాగునీరందిస్తున్నాయి. తమ సొగసులు, సుగంధాలతో మనల్ని ఆహ్లాదపరుస్తున్నాయి పుష్పాలు. ఫలవృక్షాలు పలురకాల ఫలాలను, పైరులు పప్పులు, ధాన్యాలను, కూరమొక్కలు కూరగాయల్ని పశువులు పాలను అందిస్తున్నయ్. ఎద్లు వ్యవసాయానికి రవాణాకు తోడ్పడుతున్నాయి. పుడమి తల్లి తన గర్భంలోని ఖనిజాలు, ఇంధనాలు, జలాలను అందిస్తున్నది అలా భూమ్మీది జీవులు, నిర్జీవులు, భూమితోసహా మానవాళిని కాపాడుకుంటున్నాయి దేనికి? వాటన్నింటినీ మనం ఆదుకుంటామన్న ఆశతో, విశ్వాసంతోనే గదా.

మరి వారి ఆశల్ని, భూమాత ఆశయాన్ని నెరవేర్చేదిశగా మన మానవులం పయనిస్తున్నామా? మమ్మాటికీ లేదనే చెప్పాలి. తన ప్రగతికి తోడ్పడుతున్న సోదర జీవరాశుల పట్ల, పుడమితల్లి పట్ల నిరంతరం కృతజ్ఞతాభావంతో వుండాల్సింది పోయి, అసలు భూమ్మీద జీవించే హక్కు తనొక్కనికే వున్నట్లు, తక్కిన జీవరాసులన్నీ తనకోసం పనిచేయాల్సిన సిబ్బంది అన్న అవాంఛనీయం, అధర్మ, అహంభావాలతో ప్రవర్తిస్తున్నాడు మనిషి. పోనీ అతను తన మానవజాతి అందరి కోసమైనా తోడ్పడుతున్నాడా అంటే అదీ లేదు. ఎవడు బ్రతికితే వాడే, ప్రక్కవాడేమైతే నాకేంటి? అను స్వార్థపు అఘాతంలో పడిపోతున్నారు మానవులు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కవులు, కళాకారులు, మేధావులు, మీడియావాళ్ళు, శాస్త్రజ్ఞులు, వ్యాపారులు, రాజకీయనాయకులు ప్రతిఒక్కరూ మనసా, వాచా, కర్మణా డబ్బు! డబ్బు! డబ్బు కోసమే, కొండ శిఖరం మీద కుమ్మరించిన బంగాళాదుంపల్లా చెల్లాచెదురుగా ఉరుకులు, పరుగులు పెడుతున్నారు మనుషులు.

మానవ సమాజ భద్రత కోసం ధర్మం! అర్థం (ధనం)! కామం! మోక్షం అను నాలుగు కర్తవ్యాలను నిర్ధేశించారు పెద్దలు. ధర్మమార్గంలో ధనం సంపాదిస్తూ, ధర్మమార్గంలో కామం తీర్చుకుంటూ మోక్షాన్ని సాధించడమే వాటి పరమార్థం. ఐతే ధర్మాన్ని, మోక్షాన్ని వదిలేసి, ఏంచేసైనా ధనాన్ని సంపాదించాలి. ఎలాగైనా కామాన్ని తీర్చుకోవాలి. అన్న అపమార్గాన కొట్టుకుపోతున్నారు నేడు మనవాళ్ళు. అందుకే అవినీతి పరులకు, హెచ్.ఐ.వి. బాధితులకు అగ్రస్థానంలో ఉన్నది మన భారతదేశం.

అవినీతి విషయానికొస్తే తరతరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తిపరులుగూడ, అక్రమార్జనకు పాల్పడటం మన సమాజపు దౌర్భాగ్యం. ఇక మన రాజకీయమైతే 'ధనంతో అధికారం – అధికారంతో ధనం' అను చట్రంలో ఇరుక్కుపోయింది. పాలకులు + ప్రభుత్వాధికారులు + బహుళజాతి సంస్థలు బలోపేతమైన త్రిభుజ చట్రంగా మారి, ఆకాశమే హద్దుగా అవినీతిని కొనసాగిస్తున్నారు. యెడ్యూరప్పా, గాలి సోదరులు, రాజగోపాల్, శ్రీలక్ష్మి, రాజా, కనిమొళి, కల్మాడీ, హసన్ ఆలీ, మధుకోడా, అర్జునముండా, బాబూలాల్ మురండా సుఖరామ్ మొ॥ అవినీతి రత్నాలే అందుకు నిదర్శనాలు. పోనీ ఇలాంటి అవినీతి పరులను ప్రజలేమైనా ఛీకొడుతున్నారా అంటే అదేమీ లేదు. ఏ వర్గానికి, ఏ పార్టీకి చెందిన అవినీతి పరులను ఆ వర్గం, ఆ పార్టీ వాళ్ళు సమర్థించడమే గాదు వాళ్ళకు బ్రహ్మరథాలు పడుతున్నారు. ఉదా॥ ఇటీవలే జైలునుండి బెయిలుపై విడుదలైన కనిమొళిని డి.యం.కె.వాళ్ళు మతాబాలు, టపాసులు కాలుస్తూ స్వాగతించడం స్వీట్లు పంచిపెట్టడం వంటి సన్నివేశాలు, భారతదేశంలో విలువలు తారుమారయ్యాయనటానికి నిదర్శనాలు.

మంచి నాయకుల కోసం మొఖం వాచి వున్న భారతదేశానికి, నిజాయితీపరులైన మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, ఆంటోనీ, పురంధరేశ్వరి వంటి పాలకులు, మాణిక్‌సర్కార్, మమతా బెనర్జీ, ఊమెన్ చంద్, కిరణ్‌కుమార్ వంటి మచ్చలేని ముఖ్యమంత్రులు, ఆశాజ్యోతుల్లా కనిపిస్తున్నారు. ఎందుకంటే స్వార్థంతో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ లభించిన సదవకాశాన్ని దుర్వినియోగం చేయడానిక్కాదు, పుడమితల్లి ఆశలు, ఆశయాలను నెరవేర్చేందుకే మనం జన్మించాము. అందుకే మనకీ సదవకాశం లభించింది. అన్న వాస్తవాన్ని గుర్తించిన మనుషులు వాళ్ళు. అలా తాము పుట్టింది ఎందుకో తెల్సుకోగలిగిన ప్రముఖులలో డా॥ దగ్గుబాటి ఒకరు. ముప్పై సంవత్సరాల తన సుదీర్ఘరాజకీయ జీవితంలో నేటికీ మచ్చలేని చందమామలా భాసిస్తున్నారాయన.

## నిర్మల, నిరాడంబరుడు

దగ్గుబాటి రమాదేవి, చెంచురామయ్య పుణ్యదంపతులకు 14.12.1953న, కారంచేడు గ్రామంలో జన్మించారు దగ్గుబాటి వెంకటేశ్వరరావు. బాల్యంనుండే ఆయన మేనమామ దుర్గయ్య వెంట తిరుగుతూ నిరాడంబరత, సామాజిక సేవా కార్యక్రమాల నలవరచుకున్నారు. విద్యార్థి నాయకునిగా వుంటూ, సేవా కార్యక్రమాల ద్వారా అందరి అభిమానాన్నీ సంపాదించారు. ఒకసారి తప్పనిసరి పరిస్థితిలో హెచ్.యం. వద్దంటున్నా వినకుండా హైస్కూల్లో అంతస్థు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌కి బెంచీలన్నీ ఒక్కడే మోసి, రేపటి పరీక్షల అరేంజ్‌మెంట్ సమస్యను పరిష్కరించి హెచ్.యంతో సహా అందర్నీ ముక్కున వేలేసుకునేలా చేసాడు. కలవారి అబ్బాయి ఐనా అంత నిరాడంబరత, కార్యదక్షత కలవాడు వెంకటేశ్వరరావు. అతను మా విద్యార్థి అంటూ నేటికీ సగర్వంగా చెప్పుకుంటుంటారు సదరు ఉపాధ్యాయులు. బాల్యంలోనే కాదు, యన్.టి.ఆర్.కు అల్లుడైన తర్వాత గూడ, యన్.టి.ఆర్. పార్టీ స్థాపించిన కొత్తల్లో ఒక మీటింగ్ అరేంజ్ మెంటుకు పాతిన గుంజలన్నీ రాత్రి కొట్టిన గాలివానకు పడిపోగా తెలిసిన

డా॥ దగ్గుబాటి చీకటిలో లేచి దొరికిన కొద్దిమందితో కలిసి తనూ స్వయంగా గుంజలు పాతి, అందర్నీ విస్తుపోయేలా చేసాడు. అలాగే ఆరోగ్య శాఖామంత్రిగా నిర్విరామ పర్యటనల్లో వుండేవారు. ఒక్కోసారి డ్రైవర్‌తో సహా సిబ్బంది అంతా అలిసిపోయేవారు. అది గమనించిన డాక్టరుగారు మార్గమధ్యంలోనే కాన్వాయ్ నాపించి విశ్రాంతి తీసుకోమనేవారు. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు, మహాద్భాగ్యంగా భావించి వాళ్ళందరికీ సకల సౌకర్యాలు కల్పించగలవాళ్ళు కొల్లలుగా ఉన్నారు. కానీ అర్ధరాత్రులపరాత్రులు ఎవరినీ ఇబ్బందిపెట్టటం ఇష్టం లేక, ఏదో ఒక ఊరు వెలుపల రోడ్డుప్రక్కనే పరివారంతోపాటు తానూ కార్లోనే కునుకుతీసినట్టి నిరాడంబర మంత్రి డా॥ దగ్గుబాటి. ఆయన నిరాడంబరతకు మచ్చుకు కొన్ని నిదర్శనాలివి. 'నా భర్త డా॥ వెంకటేశ్వరరావు గారి అరుదైన వ్యక్తిత్వం, నిరాడంబరతలు నాకు స్ఫూర్తిదాయకాలని' అంటుంటారు కేంద్రమంత్రి పురంధరేశ్వరి.

**నిరంతర కార్యదక్షుడు :**

సదవకాశం కరిగిపోయే మంచు. నీ మంచినంతా చకచకాపంచు' అనేది దగ్గుబాటి దంపతుల ధ్యేయం. ఆ ధ్యేయంతోనే ఆరోగ్యశాఖామంత్రిగా యుద్ధప్రాతిపదికన డాక్టరుగారు రాష్ట్రాన్ని కందిస్తున్న సేవలకు ముచ్చటపడిన నాటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి. 'ది డైనమిక్ మినిస్టర్ మిస్టర్ దగ్గుబాటి. అంటూ ఎన్నోసార్లు ప్రశంసించారు. ఆయన హయంలోనే నిమ్స్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించి బాగా అభివృద్ధిపరిచి, దేశంలోనే తొలిసారిగా నిమ్స్‌కు డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు తేగలిగారు. నాడు నిమ్స్‌లోని వసతులకు ముచ్చటపడిన నాటి ప్రతిపక్ష నాయకుడు భాగారెడ్డి, తన బైపాస్ సర్జరీ కొరకు రాజీవ్‌గాంధీ చేసిన అమెరికా ఏర్పాట్లను సున్నితంగా తిరస్కరించి, నిమ్స్‌లోనే సర్జరీ చేయించుకున్నారు. అనంతరం ఇక నుండి వి.ఐ.పి.లెవ్వరూ ఇలాంటి సర్జరీల కోసం విదేశాలకు వెళ్ళక్కరలేదు. అన్నీ సదుపాయాలూ నిమ్స్‌లోనే ఉన్నాయంటూ పత్రికా ముఖంగా ప్రశంసించారు. డాక్టర్ గారి హయాంలోనే వుండాలని కాక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పరిచారు. జిల్లా కేంద్రాలన్నింటిలోని ఆరోగ్య కేంద్రాలను విస్తరించి, అభివృద్ధిపరిచారు. అందులో భాగంగానే నేడు ఒంగోల్లో ప్రకాశం భవనం ఎదురుగా, కనిపిస్తున్న బ్రహ్మాండమైన ఆరోగ్య కేంద్ర భవనాలు వెలిసింది ఆయన హయాంలోనే. ప్రకాశం జిల్లాలోని ఎత్తిపోతల పథకాలలో దాదాపు 90% ఆయన కృషి ఫలితాలే. అలాగే బస్‌స్టేషన్లు, బస్ షెల్టర్లు గూడ. నాడు ఆయన చేస్తున్న అభివృద్ధి పనుల వేగానికి ఒకవైపు ఆశ్చర్యపడుతూనే, ఆ... మామ సి.యం., ఆయన మంత్రి కాబట్టి చేయగల్గుతున్నాడు లెమ్మంటూ చప్పరించే ప్రయత్నం చేసేవాళ్ళు ప్రతిపక్షాల వారు. కానీ ప్రస్తుం కేవలం శాసనసభ్యునిగా వుంటూ గూడ నాటికన్నా ఎక్కువ వేగవంతంగా పనులుచేస్తున్న డాక్టరుగారి సామర్థ్యాన్ని కొట్టిపారేయడానికి వంకలేమీ దొరక్క ఇబ్బందిపడిపోతున్నారు ప్రత్యర్థులు. 'సూర్యుడు అనుకూల వాతావరణంలో దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. అనుకూలంగా లేని ముసురు వాతావరణంలో కనిపించకుండానే తన కర్తవ్యాన్ని నెరవేర్చు తుంటాడు. డాక్టరుగారి పనితనమూ అంతే'! నంటూ ఇప్పటికీ మురిపిసోతున్నారు సీనియర్ సిటిజన్లు.

**భౌతిక ఆధ్యాత్మికవాది :**

డాక్టరుగారు చేసిన, చేస్తున్న అనన్యసామాన్యమైన కృషిని గూర్చి ఎవరైనా ప్రశంసిస్తున్న సందర్భాలలో నవ్వు ముఖంపెట్టి 'అదంతా భగవంతుని చలువే' అంటుంటారు. అలాగే అపత్సమయాలలో ప్రజలకోసం నిరంతరం పాటుపడుతూనే వారిని కాపాడు మంటూ దేవునికి పూజలూ చేస్తుంటారు. రూపాయి నాణేనికి బొమ్మా బొరుసూ రెండూ వున్నట్లు భౌతిక, ఆధ్యాత్మిక వాదాలనే రెండు పార్శ్వాలు గలిగిన పరిపూర్ణ వ్యక్తి ఆయన. ఉదాహరణకు లైలా తుఫానుకు జరిగిన పంట నష్టాలను నియోజకవర్గమంతా తిరిగి చూసొచ్చి తనగదిలో కూర్చుని చ్చు... చ్చు... అని నిట్టూర్చుతూ, విచార వదనంతో శూన్యంలోకి చూస్తూ తల అడ్డంగా వూపుతూ, పెదవి విరుస్తూ, ప్రభుత్వ సహాయం ఏ మూలకొస్తుంది, ఎన్ని ఆత్మహత్యల కబుర్లు వినాల్సొస్తుందో అంటూ 'కొద్ది సేపు మనసులోనే వ్యధచెందారు డాక్టరుగారు. కొద్ది రోజుల తర్వాత పాదయాత్రగా కోటప్పకొండకెళ్ళి 'ఈ ప్రకృతి వైపరీత్యాలనుండి ప్రజలను కాపాడుమంటూ పరమ శివునకు మహా యజ్ఞం చేసారు. తిరిగి తన నియోజక వర్గంలోని చిట్టచివరి బాధితునకు గూడ ప్రభుత్వ సాయమందేలా నిర్విరామంగా కృషిచేస్తారు. అలాగే కాలువలకు నీళ్ళు వదిలే సమయంలో ఏటా బకింగ్ హాం జలాల్లో గంగమ్మ తల్లిని పూజిస్తుంటారు. మరో వైపు కాల్వల మీద నిర్విరామంగా తిరుగుతూ అధికారులనదిలిస్తూ చివరి భూములకు నీళ్ళందేలా చేస్తారు డా॥ దగ్గుబాటి. తమ కోసమేగాక, ప్రజల సుఖశాంతుల కోసం గూడ పూజలు చేసే అరుదైన వ్యక్తులు దగ్గుబాటి దంపతులు.

**కుల,మత సామరస్యవాది :**

డాక్టరు గారి పి.ఏ. సుభానీ గారు చెప్పిన సంఘటన ఇది. గత సంవత్సరం ఒకరోజు డాక్టరుగారి కుటీరం దగ్గరకు నలుగురు కుర్రాళ్ళొచ్చి, కాసేపు గుసగుసలాడుకుని, తర్వాత అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరి పేరు, కులము అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఆశ్చర్యంగా 'అదేంటి సుభానీగారు కమ్మవాళ్ళను తప్ప తక్కిన కులాల వాళ్ళను దగ్గరకు చేరనివ్వడని మా వాళ్ళు అనుకుంటున్నారే. కానీ ఇక్కడందుకు పూర్తి విరుద్ధంగా వుందే? (అప్పుడక్కడ పనిలో ఉన్నవాళ్ళు ముస్లిం - బ్రాహ్మణ్ - రజక - క్షురక - యాదవ - ఎరుకల - మాదిగ - మాల వర్గస్తులు) అంటూ అసలు విషయం బయటపెట్టారట. అప్పుడు సుభానీ గారు పెద్దగా నవ్వి వారితో ఇలా చెప్పాడట. 'బాబూ దూరంగా వున్న కర్పూరాన్ని చూపించి అది ఉప్పు అని చెప్పగానే అందరూ నమ్మేస్తారు. కానీ వారిలో ఎవరో ఒకడు మాత్రం దగ్గరగా వచ్చి దాన్ని కొద్దిగా రుచిచూసి ఇది ఉప్పుగాదు కర్పురమహో అని కేకేసాడట. అప్పటి దాకా దాన్ని ఉప్పని దుష్ప్రచారం చేస్తున్నవాళ్ళు చల్లగా జారుకున్నారట. అదిగో ఆ ఒక్కడిలాంటివాళ్ళయ్యా మీరు. ఇక మీరు గూడ వెళ్ళి డాక్టరు గారిపై అభాండం వేస్తున్న మీ వాళ్ళందరి నోళ్ళూ మూయించండని చెప్పి

వాళ్ళకు షేక్‌హాండిచ్చి పంపేసాడట సుభానీ. శరత్సాహిత్యం, గాంధీ, నెహ్రూల వంటి ప్రముఖుల రచనలు చిన్నప్పటి నుండే కులమత సామరస్య, స్త్రీ అభ్యుదయ, దేశభక్తి భావాలతో డాక్టరుగారి హృదయాన్ని నింపేసాయి. అందుకే డాక్టరుగారు హిందూ మతాన్ని అనుసరిస్తూనే ఇస్లాం, క్రైస్తవ మతాలను గౌరవిస్తుంటారు. మందిరాలతో పాటు, చర్చి, మసీదులకు గూడ నిధులు, విరాళాలు నందిస్తుంటారు. సుభానీ గారన్నట్లు డాక్టరు గారు నిజంగా కర్పూరమే.

**డిసెంబరు విశిష్టత :**

యేసుక్రీస్తు, స్టాలిన్, మావో సేటుంగ్‌లు జన్మించిన డిసెంబరులోనే జన్మించారు డా॥దగ్గుబాటి. ఐతే డాక్టరు గారిని వారితో పోల్చడం కాదుగాని, వారి విశిష్ట లక్షణాలలో కొన్ని డాక్టరుగారిలోనూ ఉన్న మాట నిజం. ఉదా॥ యేసుక్రీస్తు ఆచరిస్తూ బోధించిన క్షమాగుణాన్ని డాక్టరు గారూ అలవరచుకున్నారు. ఏ హరిజనుల కారణంగా తన తండ్రి హత్యకు గురయ్యాడో, అదే హరిజనులు నీడను కోల్పోయి చెట్టుకొకరు, పుట్టకొకరైతే, వారిని చేరదీసి కొంత సొంతభూమిగూడ ఇచ్చి పునరావాసాన్ని కల్పించారు డా॥ దగ్గుబాటి. అందుకే 'ఆయన మనిషికాదయ్యా దేవుడు' అంటుంటారు ఇప్పటికీ సదరు హరిజనులు. అలాగే తండ్రిని చంపిన దోషులను క్షమాబిక్ష పెట్టమని సి.యం. వై.యస్. నర్ధించారు డాక్టరుగారు. అలా క్షమాబిక్ష పొందినవారిలో ఒకరు ప్రస్తుతం యన్.ఆర్.ఐ హాస్పిటల్‌లో డాక్టరుగా పనిచేస్తున్నారు. డాక్టరుగారి క్షమాగుణాన్ని కివి కొన్ని నిదర్శనాలు. అలాగే స్టాలిన్, మావోల వలె రాజకీయ రంగంలో పనిచేస్తూనే రచనా వ్యాసంగమూ చేస్తున్నారు డా॥ దగ్గుబాటి. స్టాలిన్‌గారి 'జాతుల సమస్య' మావో గారి 'మవో సూక్తులు' అను గ్రంథాలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. అలాగే డాక్టరు గారి ఒక చరిత్ర – కొన్ని నిజాలు, ప్రపంచతత్వం – నాయకత్వం అను గ్రంథాలు జాతీయంగాను, 'తెలుగు వారి చరిత్ర వేర్పాటు వాదం' అను గ్రంథం రాష్ట్రీయంగాను ప్రశస్తి గడించినాయి.

**జీవించే మనుషులు :**

దగ్గుబాటి దంపతుల ఇంకో విశిష్టత ఏమంటే నిరంతరం ఆత్మవిమర్శ చేసుకుంటూ పొరపాట్లను సవరించుకుంటారు. అలాగే నిరంతర విద్యార్థులూ పఠిస్తూ సద్విమర్శలను స్వీకరిస్తూ, అభాండాలు వేస్తున్న వారిని వాళ్ళ పాపానికే వదిలేస్తూ, తమ వ్యక్తిత్వాన్ని, పని విధానాన్ని మెరుగు పరచుకుంటూ ముందుకెళుతుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే జీవిస్తున్న మనుషులు దగ్గుబాటి దంపతులు. 'జీవించటమంటే నిరంతరం నూతన (ప్రగతిశీల) వ్యక్తిత్వంలోకి జన్మించడం. అలా జన్మించడం ఆగిపోతే జీవిస్తున్న అది ఆంతరంగిక మరణమే. అలా జీవిస్తున్న మనుషులు. సర్వతోముఖంగా ఎదిగిన సంపూర్ణ వ్యక్తులు. రాజ నీతిజ్ఞులు. బహుముఖ ప్రజ్ఞాశాలులు ముఖ్యంగా రాజకీయ రంగంలో బహుఅరుదు. అలాంటి అరుదైన వ్యక్తులను ఏ పార్టీలో ఉన్నాసరే, వాళ్ళు విసిగి, వేసారి కాడికిందెయ్యకుండా కాపాడుకోవలసిన బాధ్యత అటు పార్టీలమీద, ఇటు ప్రజలు మేధావులు, మీడియా వాళ్ళందరి మీద ఉన్నమాట నిజం. ఈ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించే శుభపరిణామం కోసం, మనవంతు కృషి చేస్తూ మనసారా భగవంతుని ప్రార్థించుదాం. తథాస్తు!

******



# మూడు దశాబ్దాల రాజకీయ మకుటధారి

## డా॥దగ్గుబాటి.

**డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు రాజకీయాల్లో అందరికీ తెలిసిన పేరు డాక్టర్ దగ్గుబాటి ప్రజలకు చిరపరచితులు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో వుంటూ, మచ్చలేని నేతగా గుర్తింపు పొందిన ఏకైక నాయకుడు డాక్టర్ దగ్గుబాటి. నిత్యం సంక్షోభాలు, సమస్యలతో సతమతమయ్యే వర్తమాన రాజకీయాల్లో ఏ బురద అంటని ఒకే ఒక నేత దగ్గుబాటి. ఎన్నికలంటే భయపడి, బరిలోకి దిగడానికి సందేహించే నాయకులున్న కాలంలో పోటీచేసిన ప్రతిసారి ప్రజాభిమానంతో గెలిచి, అపజయం లేని నేతగా గుర్తింపు పొందిన అరుదైన నాయకుడు డాక్టర్ దగ్గుబాటి. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధత అనే మూడు మాటలకు విలువలేకుండా పోయిన రోజుల్లో ఆ మూడు మాటలనే ప్రాణవాయువులుగా చేసికొని ముందుకు సాగుతున్న ప్రజా హృదయనేత దగ్గుబాటి. రాజకీయ నాయకుల్లో అరుదుగా కనిపించే మంచితనం, మానవత్వం, పరోపకారతత్వం, దయార్ధ్ర గుణం దగ్గుబాటిని విలక్షణ నేతగా నిలిపాయి.**

1983లో మార్టూరు నియోజక వర్గం నుండి ప్రారంభమైన దగ్గుబాటి రాజకీయ ప్రస్థానం, నేటి వరకు నిరాటంకంగా సాగుతుంది. నిరాఘాటంగా నడుస్తుంది. దాదాపు మూడు పదుల రాజకీయ జీవితంలో ప్రజాభిమానవే పెట్టనికోటగా తనదైన మార్గంలో నడుస్తూ, ప్రతిపక్ష నేతలు సైతం వేలెత్తి చూపని విధంగా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటున్న ఏకైక నాయకుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు.

డాక్టర్ వెంకటేశ్వరరావు గారు ఏనాడూ దర్పాన్ని ప్రదర్శించిన దాఖలాలు లేవు. నిరాడంబరంగానే జనసామాన్యంతో మమేకమై నడవడం ఆయన రాజకీయ భవితవ్యానికి బాటలు వేసింది.

డాక్టర్ గారు తాను ఏనాడూ ప్రజానాయకుణ్ణి అవుతానని ఊహించలేదు. తండ్రి చెంచురామయ్యగారి ఆశల కనుగుణంగా మంచి డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తూ, పదిమందికీ మంచి చేయాలనే తపన దగ్గుబాటి లో వుండేది.






అందుకనుగుణంగానే తన విద్యాభ్యాసం కొనసాగించారు. యం.బి.బి.యస్. పూర్తి చేశారు. పి.జి. చేస్తున్న నేపథ్యంలో డాక్టరు గారి జీవితం మలుపు తిరిగింది. ఆ మలుపే మజిలీలు లేని సుదీర్ఘ రాజకీయ భవితవ్యానికి రాచబాట వేసింది.

1982లో సుప్రసిద్ధ సినీ నటులు డాక్టర్ నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. 1983 ఎన్నికల్లో సంచలన విజయం సాధించి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే యన్టీఆర్ ఆహ్వానంతో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలన్నింటిలో ముఖ్యపాత్ర వహిస్తూ, అన్నగారి బహిరంగ సభలను, ఎన్నికల ప్రచార సభలను జయప్రదం చేయడంలో దగ్గుబాటి కీలక భూమిక పోషించారు. అనంతరం రామారావు గారి కోరిక మేరకు 1983లో మార్టూరు నుంచి గెలిచి, అసెంబ్లీలోకి అడుగుపెట్టారు డాక్టర్ గారు. అనంతరం 1985, 1989ఎన్నికల్లో పర్చూరు నుండి గెలుపొందారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా నిబద్ధతతో పనిచేసి అందరి ప్రశంసలు పొందారు. మండలానికో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హైదరాబాద్ లోని 'నిమ్స్' కు స్వయం ప్రతిపత్తి ఆధునికీకరణ, అభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన అన్నీ డాక్టర్ గారి హయంలోనే జరిగాయి. మంత్రి పదవి అలంకారం కాదని, అంకితభావంతో ప్రజలకు మేలు చేయాలని భావించే కొద్దిమంది మంత్రుల్లో దగ్గుబాటి ఒకరు.

1991లో బాపట్ల నుండి లోక్‌సభకు ఎన్నికయి, ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యపరిచారు. 1995 లో మారిన రాజకీయ పరిస్థితుల్లో రాజ్యసభకు పోటీ చేసి సంచలన విజయం సాధించి, రాజకీయ విశ్లేషకులను సైతం అబ్బురపరిచారు. రాజకీయాల్లో మంచితనం, కలుపుగోలు తనం, పార్టీలకతీతమైన స్నేహ సంబంధాలు ఎలా ఉపయోగపడతాయో, ఈ విజయంతో దగ్గుబాటి నిరూపించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా డాక్టర్ గారు ప్రజలతో మమేకమై ప్రజావసరాలను గుర్తించి, చేపట్టిన వివిధ అభివృద్ధికార్యక్రమాలు, మంచి పనులకు మంజూరు చేసిన నిధులు వారికి చిరస్మరణీయమైన గుర్తింపునిచ్చాయి.

తెలుగుదేశంలోనే పుట్టి, తెలుగుదేశంలోనే పెరిగి, తెలుగుదేశానికే అంకితమైన డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు రాజకీయంగా కొంత ఒత్తిడికి గురైన కాలమది. తెలుగుదేశానికి దూరమై, తన రాజకీయ జీవితవ్యాన్ని నిర్ణయించుకోవలసిన సందిగ్ధ సమయమది. సహజంగా నాయకుడిని నిర్ణయంపై క్యాడర్ (అనుచరగణం) ఆధారపడి ఉంటుంది. కాని అందుకు భిన్నంగా క్యాడర్ నిర్ణయం ప్రకారం తన భవితవ్యాన్ని నిర్ణయించుకునేందుకు, నియోజకవర్గానికి వచ్చారు. సభలు పెట్టారు. సమావేశాలు నిర్వహించారు. అంతరంగికులతో అనుచరులతో చర్చించారు. అందరూ మీ వెంటే మేము వుంటామన్నారు. పార్టీకన్నా మీరే ముఖ్యమన్నారు. మీ నిర్ణయానికి కట్టుబడి వుంటామన్న కార్యకర్తల మనో ధైర్యంతో అనుచరుల అండదండలతో డాక్టర్‌గారు తన గమ్యాన్ని గండిపేట నుండి గాంధీభవన్‌కు మార్చుకున్నారు. అప్పట్లో డాక్టర్ గారి నిర్ణయం కొందరిని విస్మయపరిచింది. డాక్టర్‌గారు కాంగ్రెస్ లో ఇమడగలరా? అని చర్చించుకున్నారు. చాలామంది డాక్టర్ గారి





నిర్ణయాన్ని స్వాగతించారు. అనుకూల, ప్రతికూల పరిస్థితుల మధ్య డాక్టర్ గారు మడమ తిప్పకుండా ముందుకుసాగారు. తాను నమ్ముకున్న ప్రజాభిమానంతో 2004 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గం నుండి 15 వేలకు పైగా మెజారిటీ విజయం సాధించారు.

రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. పదవులు కూడా అంతే. అయితే డాక్టర్‌గారు పదవులకోసం ఏనాడు ప్రాకులాడలేదు. స్వార్ధరాజకీయం నడపలేదు. కర్తవ్యదీక్షతో, కాలానుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారు. రాజకీయాల్లో జనహితమే తన అభిమతంగా నడిచారు. చెదరని ఆత్మవిశ్వాసంతో చెరగని చిరునవ్వుతో, ఆటుపోట్లను అధిగమించారు. ఆశయం ఉన్నతమైనపుడు, ఆలోచన సమున్నతమైనప్పుడు, ఆచరణ ఆమోదయోగ్యంగా వుంటుంది. దాన్ని ప్రజలు ఆదరిస్తారు. అండగా నిలుస్తారు. డాక్టర్ దగ్గుబాటి విషయంలో కూడ జరిగింది కూడ అదే!

2009 అసెంబ్లీ ఎన్నికల్లో పర్చూరు నుండి పోటీ చేసిన దగ్గుబాటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నుండి గట్టిపోటీ ఎదుర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో కొన్ని గ్రామాలు తారుమారయ్యాయి. డాక్టర్ గారు అందరికీ తెలిసిన నేత అయినప్పటికీ, కొన్ని గ్రామాలకు వెళ్ళి అక్కడ నాయకులతో మాట్లాడి ఓటర్లను కలిశారు. దీనికి తోడు కొత్తగా స్థాపించిన ప్రజారాజ్యం; లోక్‌సత్తా పార్టీల అభ్యర్థులతో పోటీలో వున్నారు. కాంగ్రెస్‌కు పెట్టనికోటవంటిది. పేద, బలహీన వర్గాల ఓట్లు చీలడం వంటి కారణాలతో దగ్గుబాటి విజయంపై విశ్లేషకులు సందేహాలు వెల్లిబుచ్చారు. అయినా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 3 వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించి, తిరుగులేని నేతగా, అపజయం ఎరుగని ప్రజాహృదయ విజేతగా చరిత్ర సృష్టించారు.

డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు గండిపేటలో పసుపు కండువా వేసినా, గాంధీభవన్‌లో తెల్ల చొక్కా ధరించినా ఆయన స్నేహం పార్టీల కతీతమైంది. అన్ని పార్టీల్లో ఆయన శ్రేయోభిలాషులు ఉన్నారు. అభిమానులున్నారు. ప్రాణమిచ్చే స్నేహితులున్నారు. రాజకీయమైనా, వ్యాపారమైనా నీతి తప్పకూడదన్నది దగ్గుబాటి




నైజగుణం. పల్లె నుండి ఢిల్లీకి ఎదిగినా, దగ్గుబాటి ఏనాడూ నేలవిడిచి సాము చేయలేదు. ప్రజాబలమే తన బలంగా భావించారు. ప్రజల మనసుల్లో ఒదిగి ఎదిగారు. కపటం లేని మనస్తత్వంతో, మంచిని కోరే వ్యక్తిత్వంతో, అందరికీ ఆప్తుడిగా, ఆత్మీయుడిగా ముందడుగు వేస్తున్నారు.



డాక్టర్ దగ్గుబాటి ఆర్ధ్రమనస్కులు. స్వతహాగా సహృదయులు. పని ఏదయినా, పరిస్థితి ఎలాంటిదయినా ఎదుటి వారిని నొప్పించడం ఆయనకు ఇష్టం ఉండదు. రాజకీయ నాయకుల్లో ఈ లక్షణాలు అరుదుగా ఉంటాయి. శాసనసభ్యునిగా, మంత్రిగా, యం.పి.గా పలు సందర్భాల్లో ఆయన పరోపకారదృష్టి ఎందరినో ఆదుకుంది. కన్నీళ్ళను తుడిచింది. ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో రైతులకు అండగా నిలిచారు. ఎన్నో ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయించి, నిర్మాణం పూర్తి చేయించారు. ప్రకృతి వైపరీత్యాల్లోనూ రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల అవసరాలను గుర్తించి, పరిష్కరించి, అందరికీ ఆప్తులయ్యారు.

మూడు దశాబ్దాల పాలిటిక్స్‌లో డాక్టర్ గారికి 'పాలి(ట్రిక్స్)' బొత్తిగా తెలియవు. ఎత్తులు, పై ఎత్తులు అంతకంటే తెలియవు. బహుశా వారి బలమూ, బలహీనత అదేనేమో! రాజకీయాల్లో ఫెయిర్‌గా ఉండటం, అంతకుమించి క్లియర్‌గా ఉండడం సాధ్యపడదు. డాక్టర్ గారు ఫెయిర్, క్లియర్‌లతో ఫియర్‌లేని అజాతశత్రువుగా ఎదిగారు. ఎన్ని ఎత్తులకు ఎదిగినా, ఏనాడూ అహంకారం గాని, ఆడంబరాన్ని గాని ప్రదర్శించని నిరాడంబర రాజకీయవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు గారు. పదవుల గురించి ఆలోచించే వారికి నిద్రపట్టదు. ఆహారం రుచించదు. కటుంబమూ పట్టదు. ప్రజల గురించి ఆలోచించేవారు నిశ్చింతగా నిర్భయంగా ఉంటారు. కుటుంబంతో మమేకమవుతారు. డాక్టర్ గారు రెండవ కోవలోని వారు. ప్రజలే ఆయన బంధువులు. ప్రజాశేయస్సే ఆయన శ్వాస.

డాక్టర్ గారు విద్యాభిమాని. గ్రామీణ విద్యావికాసానికి వారి కృషి అనన్యమైంది. ప్రకాశం జిల్లా ఇంకొల్లులో సోదరుడు నీలమోహన్ పేరుతో జూనియర్ కళాశాలను తండ్రి చెంచురామయ్య గారి జ్ఞాపకార్థం డిగ్రీ కళాశాలతోపాటు, బి.ఫార్మసీ, యం.సి.ఏ, యం.బి.ఏ., యం.యస్.సి. పి.జి. కోర్సులను బోధించే కళాశాలలను నెలకొల్పి, విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రామీణ బాలబాలికలకు ఇంగ్లీషు మీడియం బోధనను అతితక్కువ ఖర్చులో అందించాలనే ఏకైక ధ్యేయంతో అదే ప్రాంగణంలో "నివేదిత ఇంగ్లీష్ మిడియం హైస్కూల్‌ను స్థాపించారు. వివిధ గ్రామాల నుండి 1400 మందికిపైగా విద్యార్థులు స్కూలులో చదువుతున్నారు.



డాక్టర్ దగ్గుబాటి దంపతులు రాజకీయాల్లో నిత్యశోభితం కంఠాభరణం. మూడు దశాబ్దాలుగా నీతివంతమైన వారి ప్రయాణం తెలుగువారికి బంగారు కీర్తి తోరణం!



డా॥ బీరం సుందరరావు

******

# నేటి మేటి డా॥ దగ్గుబాటి

**ఈనాటి మన వార్తలలోని వ్యక్తి డా॥ దగ్గుబాటి 2009 ఆగస్టు 23 నుండి నేటి వరకు ఆయన కలం నుండి 714 పేజీలతో 21 వేయి ముద్రణ ప్రతుల గల మూడు పుస్తకాలు వెలువడి కాంతిరేఖలు వెదజల్లాయి. ఆంధ్రావనిలో హాట్ కేక్‌లా ప్రథమ ముద్రణలోనే అమ్ముడుపోయి కలకలం సృష్టించాయి. ప్రస్తుతం అవి వాడివాడిగా వేడి వేడిగా రచ్చబండల దగ్గర రాజ్యమేలు తున్నాయి.**

**ప్రస్తుతం పాలిటిక్స్‌లో వున్న డా॥ డి.వి.ఎల్లప్పుడూ విజేతగా ఇటు 5 సార్లు రాష్ట్రశాసనసభకు, రెండుసార్లు పార్లమెంటుకు ఎంపికై రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక రికార్డు సృష్టించిన సంగతి జగమెరిగిన సత్యం.ముఖ్యంగా మచ్చలేని మాణిక్యంలా నిలువుటద్దంలో నిటారుగా కన్పిస్తారు. ప్రతిరంగం లోను ఆయనిది రికార్డ్ చెప్పడమే.**

**బ్రిటీష్ మాజీ ప్రధాని చర్చిల్ ఒక సందర్భంలో మాట్లాడుతూ భారతమాజీ ప్రధాని నెహ్రూ రాజకీయాలల్లోకి రాకుండా వున్నట్లయితే, ఇంగ్లీషులో డిస్కవరి ఆఫ్ ఇండియాతో పాటు ఇంకెంత సాహిత్యం సృష్టించి వుండేవారో?**

**అదే విధంగా కేవలం 2 నెలలలో తన శక్తి యుక్తులతో 714 పేజీలకు శ్రీకారం చుట్టిన వ్యక్తి 28 సం॥లు రాజకీయాలలోకి రాకుండా వుంటే ఎన్నో వేల పేజీలు వ్రాసి, తెలుగునాడులో ఒక బ్రిటీష్ మ్యూజియం గ్రంథాలయంలా తెలుగు గ్రంథాలయం రూపురేఖలు దిద్దుకొని ఉండేది.**

**డా॥ దగ్గుబాటి ప్రస్తుతం తెలుగువారి చరిత్ర వేర్పాటువాదం 191 పేజీలతో ఒక సరికొత్త అన్వేషణతో చరిత్ర సృష్టించి, చరిత్రకారునిగా ముఖ్యంగా పరిశోధకునిగా మనకు కన్పిస్తారు.** మరో విచిత్రమే మంటే, ఎవ్వరిచేత యీ పుస్తకానికి పీఠిక వ్రాయించ కుండా మరో చరిత్ర సృష్టించి గతంలో తెలుగునాట, ఎవ్వరూ, ఎక్కడా చేయని ప్రయోగం చేశారు.

ఈ పుస్తకం ఎందుకు? అంటూ వ్రాసిన ముందు మాటలో ప్రజాప్రతినిధులు ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టాలి. ఎన్నికైన తర్వాత వాటిని సంపాదించుకోవాలి. యీ మధ్య ఇంకొక పెద్దపని మీడియాను సంతృప్తిపరచబడం లేకపోతే – ఔట్ అంటూ, నిర్మొహమాటంగా చెప్పిన తొలి తెలుగు ప్రజా ప్రతినిధి గూడా అయన రాజకీయాలలో నాకు తీరికెక్కడ? ఓపికతో వేకువ జామున 2 గంటలకు నిద్రలేసి చదవడం, వ్రాయడం పూర్తి చేసేవాణ్ణి, పాఠకుణ్ణి కేవలం 3,4 గంటలలోనే చదివించాలనే తపనతో తపస్సు చేశానని, పాఠకులే న్యాయనిర్ణేతలని డా॥ దగ్గుబాటి అన్నారు.

తొలి ముద్రణలోనే 10 వేల కాపీలు హాట్ కేక్‌లా అమ్ముడుపోవడం, సక్సెస్ గ్రాండ్ సక్సెస్. మీకు ఇది తెలుగు పాఠకుడు అందించిన మంగళహారతి దిక్కులు పిక్కటిల్లేలా చేసిన నినాదులు సుమా.

**నేటి గురించి తెలుసుకోవాలంటే నిన్న కోసం వెతకాలి** – "ప్లేయర్ బుక్" సందేశాలు

**''అన్ని సామాజిక శాస్త్రాలకు ప్రయోగశాల చరిత్ర''** అనే ప్లేటో సూక్తి దగ్గుబాటి పై బలీయంగా పడింది. ముఖ్యంగా యీ పుస్తకం వ్రాయడానికి 14 పుస్తకాలను రెఫరెన్స్ చేసినట్లు దగ్గుబాటి స్వయంగా వ్రాసుకున్నారు. గతంలో ఎంతోమంది, ఎన్నో రకాల చరిత్రలు ఇటు ఇంగ్లీషులోనూ, అటు తెలుగులోను వ్రాశారు.

అయితే ఉదాహరణకు జీలం నది ఒడ్డున క్రీ.పూ. 326 లో అలెగ్జాండర్‌కు – పురుషోత్తమునికి యుద్ధం జరిగింది.




అలెగ్జాండర్ సైన్యం జీలంనదిని అర్ధరాత్రి ఏ విధంగా దాటింది? ఆనాడు ఈతకు పనికి వచ్చే ఆధునిక పనిముట్లు లేవుగదా! ఆనాడు చరిత్రకారుడుగా వెన్న కెక్కిన ధన్యంరాజు బ్రదర్స్ గూడా వ్రాయలేకపోయారు.

అయితే సుప్రసిద్ధ పశువైద్యాచార్య తెనాలికి చెందిన యేజెండ్ల శ్రీరాములు చౌదరి తన "పశువైద్య చింతామణిలో" సైన్యం తన పొట్టల క్రింద "ఎనుబోతు చర్మంతో తయారు చేసిన తిత్తులను వుపయోగించినట్లు వ్రాశారు.

అదే విధంగా "తెలుగు వారి చరిత్ర వేర్పాటువాదం" అనే పుస్తకంలో డా॥ దగ్గుబాటి ప్రప్రథమంగా'' తెనుగు అనే శబ్దానికి పుట్టుపూర్వోత్తరాలు పసిగట్టాడు.

టి.ఆర్.యన్. నాయకుడు, తెలుగులో గొప్ప ఆచార్యుడు. వేలాది విద్యార్థుల్ని తీర్చిదిద్దిన్నట్లు చెప్పుకున్నాడాయన. ప్రసంగాలన్నీ బండబూతులు మినహా




"తెనుగుగాధను ఎక్కడా వుదహరించలేదు మరి!

అయితే ఉపాధ్యాయుడు కాని దగ్గుబాటి "తెనుగు అనే మాటకు దక్షిణ దిక్కుగా తిరుగువారు లేక ప్రయాణం చేయువారు. తెన్ అంటే దక్షిణ దిక్కు అని, తమిళ, కన్నడ బాషలలో అర్థం వుందని వ్రాశారు?

తెనుగు ప్రజల ఆదివాసి నివాస స్థలం "తెలంగాణా" తెనుగు క్రమంగా తెలుగయ్యింది. అందులో నుంచే, తెలంగాణా, తెలంగాణాలు, తెవిరిగిరి, త్రిలింగదేశం మొదలైన పేర్లు ఏర్పాడ్డాయని వ్రాశారు. ఇక్కడ డా॥ దగ్గుబాటి మనకు చరిత్ర పరిశోధకునిగా కన్పిస్తారు సుమా.

ఇదే విధంగా చరిత్రకందని, మరుపురాని, మరుపగూడని, ఎన్నో, ఎన్నెన్నో, మరెన్నో చారిత్రక విశేషాలు మనకళ్ళ ముందు నృత్యం చేస్తూ వుంటాయి.

**మచ్చుకు కొన్ని :**

బృహత్కథ, శాలివాహన గాధాసప్తతి ఆధారంగా

(1) శాతవాహనుల రాజధాని "పైఠాన్" అనే విషయం

(2) కుంతల శాతకర్ణి క్రి.పూ. 38-30 ల మధ్య కేవలం తన 8 సం॥ పరిపాలన కాలంలో 'ప్రాకృత భాషకు బదులు సంస్కృత భాషను రాజభాషగా చేయడం.

(3) 1362లో మహమ్మద్ షా దండయాత్ర చేసి వినాయక్ దేవుణ్ని ఓడించి సజీవంగా దహనం చేయడం.

(4) బ్రిటీషు వానికి నిజాం ఏటా చెల్లించవలసిన 24 లక్షల రూపాయలు చెల్లించలేక క్రీ.శ.1800 సం॥లో తెలంగాణాను తన క్రింద వుంచుకొని రాయలసీమ జిల్లాలను ఇంగ్లీషు వారికి ధరాదత్తం చేయడం.

గతంలో ఇటువంటి చరిత్ర కందని యదార్ధ విషయాలను - సోదాహరణముగా డా॥ దగ్గుబాటి పేర్కొని భావితరానికి బంగారు బాటవేశారు.

1999లో టి.డి.పి. అధికారంలోకి వచ్చిన తర్వాత కె.సి.ఆర్.కు మంత్రిపదవి దక్కకపోవడం తీవ్ర అసంతృప్తి - మరల 2001లో టి.ఆర్.యస్.ను స్థాపించడం తెలంగాణా జాగో, ఆంధ్రాభాగో నినాదాలతో రెచ్చగొట్టడం - తెచ్చుడో - చచ్చుడో - అంటూ పొట్టి శ్రీరాములు మద్రాసు పట్నం కోసం నిరాహారదీక్ష చేశాడనడం టి.వి.లో చూసినవాళ్ళకు తెలంగాణా కోసం అంతిమప్రయత్నం అంటూ నమ్మబలకడం.

కె.సి.ఆర్. నిరాహారదీక్షలో ఇంటిలిజెన్స్ వైఫల్యం - తత్ఫలితంగా రోశయ్య ప్రభుత్వం తప్పడుగులు, తీరుతెన్నులు - విద్యార్ధుల ఆత్మహత్యలు - సిరిసిల్ల లో పొట్టి శ్రీరాముల విగ్రహం ధ్వంసం వరకు డా॥ దగ్గుబాటి కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు.

భవిష్యత్‌లో అడుగిడకముందే గతాన్ని గుర్తుచేసిన తీరు- మరపురానిది.

నిజాం నిరంకుశ పాలనను ఆయన కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. ఓ నిజాం పిశాచమా! కానరాడు నిన్ను బోలినరాజు మాకెన్నడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే ఒకే దాశరధిని, సికిందరో, గజనీ గోరీ, ఎవడైతేనేం కాలానికి కట్టరి కత్తుల వంతెన శ్రీశ్రీ గేయాన్ని గుర్తు తెచ్చే విధంగా చిత్రీకరించి ఒక సాహితీ అభిమానిగా డా॥ దగ్గుబాటి మనముందు సాక్షాత్కరిస్తారు.

తెలంగాణాలో కరుడుకట్టిన కసాయిగా, అరాచకాలకు, అకృత్యాలతో కీచకునిగా అవతారమెత్తిన బడా భూస్వామి రామచంద్రారెడ్డి పొలాలలో పని చేసే బాలింతలు, తన పసిపాపకు పాలుకుడిపి - వస్తానంటే - రౌడీలతో రవికను తొలగించి, రొమ్ముపాలను - ఉగ్నిన్న లో పిండి - గోటితో పొలం - కలుపు పై వెదజల్లిన ఘట్టాన్ని క్షుణ్ణంగా పఠనం చేసిన దగ్గుబాటి -


1956 తర్వాత తెలంగాణా లో నెలకొల్పిన జాతీయ అంతర్జాతీయ సంస్థలు - వివరాలను గణాంకాలతో పొందుపరచి, గతంలో, సంఘటనలు, సన్నివేశాలు, అంకెల, తారీఖులు, జ్ఞాపక శక్తికి - కాంగ్రెస్ సూత్రాలకు తార్కిక బలం చేకూర్చిన పట్టాభిగారు మనకు గుర్తుకు వస్తారు. అదే విధంగా జ్ఞాపిక శక్తికి ఆధునిక పట్టాభి డా॥ దగ్గుబాటి అని నేను అంటే అతిశయోక్తి కాదు సుమా (డా॥ దగ్గుబాటి ఒక చరిత్ర - కొన్ని నిజాలు - 159 వ పేజీలో) చివరకు అనేకచోట్ల తేదీలు గూడా నాకు తెలియకుండానే గుర్తుకు వచ్చాయి. సహజంగా నాకు మతిమరుపు ఎక్కువంటారు. ఇన్ని రోజులు నేను చేయలేని పనిని ఇంత అలవోకగా చేయడం నేను ముందు చెప్పనట్లుగా ఏదో ప్రేరణ అనుకుంటాను.

ఇంకా యీ పుస్తకంలో అమరజీవి, ఆమరణ దీక్షను వర్ణించి -

గతంలో ఐర్లాండ్ స్వాతంత్ర్యం కోసం ఒక మెక్స్విన, తోటి రాజకీయ ఖైదీలు బ్రిటీష్ హయంలో అనుభవించిన నరక యాతనకు నిరసనగా 63 రోజులు ఆమరణ నిరాహారదీక్ష అమరుడైన బెంగాల్‌కు చెందిన జితిన్ బాబు (పుంగీలు మాత్రమే. వారి సరసన 3వ వ్యక్తిగా మన అమరజీవిని నిటారుగా నిలబెట్టి డా॥ దగ్గుబాటి నిండు మనస్సుతో నివాళు లర్పించారు.

89వ పేజీలో

ప్రస్తుతం ఆంధ్ర తెలంగాణా వాదుల కంటే కృష్ణా గోదావరి జిల్లాల వాటాల పంపిణీలో రాష్ట్రాల మధ్య వున్న వైరుద్యాలను రూపుమాపుకోవాలని, బచావత్ కాలపరిమితి అయిన నేపథ్యంలో కర్ణాటక, కృష్ణానది పై ఆలమెట్టి డ్యాం ఎత్తు పెంచి అధిక నీటిని నిల్వచేసుకోవడం దీనికి తోడు - మహారాష్ట్ర,




బాబ్లీ వంటి ప్రాజెక్టులను ఎగువ ప్రాంతంలో నిర్మించి - మన రాష్ట్రానికి ఇబ్బందికలుగజేయడం - యీ సంధి కాలంలో ట్రిబ్యునల్ ముందు - మన ప్రజా ప్రతినిధులంతా సమైక్యంగా వుండి మన వాణిని గట్టిగా వినిపించాలని, అవసరమైతే న్యాయం కోసం - ప్రాణ త్యాగానికైనా వెనుకంజ వేయగూడదనే మహాత్కృష్ట సూచన చేసినందుకు దగ్గుబాటి - మీకు యీ తెలుగువాడి జేజేలు.

అయితే ఈనాడు ఓటమి ఎరుగని రాజకీయవేత్తగా "తెలుగు వారి చరిత్ర - వేర్పాటు వాదం" లో దగ్గుబాటి చరిత్రకారునిగా చరిత్రలో శాశ్వతంగా చోటు చేసుకున్నారు. ఇది తెలుగునాడు చేసుకున్న ఏ పూర్వ పుణ్యమో! ప్రయోగ ఫలమో మరి!

**మరో పుస్తకం ఒక చరిత్ర - కొన్ని నిజాలు - వ్రాసి - అన్నీ నిజాలేనని ఘంటాపథంగా నిరూపించిన పుస్తకం ఇది.**

మిత్రుల సలహాలనుననుసరించి ఏదో వుద్దేశ్యంతో ఎన్నికల సమయంలో వ్రాశారనే అపవాదం రాకుండా విశ్వసనీయత దెబ్బతినకుండా 2009 ఆగస్టు 23న 10 వేల ప్రతులతో విడుదల జేసినట్లు దగ్గుబాటి స్వయంగా వ్రాసుకున్నారు. ఏది ఏమైనా ఇది ఒక సరిక్రొత్త రికార్డు సాధించింది సుమా. కారణాలు ఏవైనా - యీ పుస్తకంపై అన్నీ అబద్దాలని, అసత్యాలని, ఆత్మస్తుతి, పరనిందలంటూ - ఈసడింపులు - ఖండన - మండనలతో - ఇటు ప్రింట్ మీడియాలో గాని ఎలక్ట్రానిక్ మీడియాలో గాని - విమర్శలు రాకపోవడం! అందుకే ఒక చరిత్ర కొన్ని నిజాలు అనే యీ పుస్తకం - ఆంధ్ర రాజకీయపు మలుపులో అంబరాన్ని అందుకొని అన్నీ నిజాలేనంటూ దిక్కులు పిక్కటిల్లే నినాదాలు చేసింది. తత్ఫలితమే 'ఏక్ ఇతిహాస్ - కుఛ్ సత్య' అంటూ హిందీలోకి పదివేల ప్రతులు మాత్రమే వెలుగు చూసినా కేవలం 3 రోజులలో ముందు వరుసలో వున్నవాడే అందుకున్నాడు. ఆసేతు హిమాచలాన్ని అంచెల అంచెలవారిగా యీ పుస్తకం చేరుతుందనేది నగ్న సత్యం 159 పేజీల యీ పుస్తకం అనువాదకుడు ఎవరు? ఎక్కడా, పేరుగాని, వూరుగాని కన్పించదు.

అయితే 4 దశాబ్దాల సర్వీసు గల హిందీ వుపాధ్యాయునిగా, ఆకాశవాణి, దూరదర్శన్‌ల ఆర్టిస్ట్‌గా, ఇటు హిందీ దినపత్రికలు అనేక హిందీ గ్రంధాలు అధ్యయనం పటిస్తూ ఉండేనేను 1985లో "హిందీ కవితా కో ఆంధ్రా కీ దేన్" అనే 203 పేజీల గ్రంధాన్ని చదవడం తటస్థించింది. దీనిని అయితే ఇటీవల 'ద్రౌపది' నవల ద్వారా కేంద్ర సాహితీ అకాడమీ అవార్డ్ అందుకున్న డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ దాని రచయిత.

తత్ఫలితంగా ఆయన భాష, శైలి, తీరుతెన్నులు, అతి జాగ్రత్తగా అధ్యయనం చేసిన నేను - ఘంటాపదంగా దీని అనువాదకుడు శ్రీ యార్లగడ్డ అని చెప్పగలను. సామాన్య పాఠకునికి అతి తేలికగా అర్ధమయ్యే రీతిలో కొనసాగిన యీ అనువాదంలో

(1) వైస్రాయి హోటల్‌కు వెళ్ళవద్దంటూ శ్రీమతి పురంధీశ్వరి కన్నీరు మున్నీరుతో డా॥ దగ్గుబాటిని వేడుకోవడం
(2) వైస్రాయి హోటల్‌లో జరిగిన రాజకీయాలు
(3) శ్రీమతి పురంధీశ్వరి సోదరులకు వ్రాసిన లెటరులో చివరి భాగం
(4) తండ్రి క్షోభ, ఆక్రోషాన్ని వెళ్ళగ్రక్కిన మాటలను డిస్క్‌లో పొందుపరచడం.

156వ పేజీలో యన్.టి.ఆర్. తనపుత్రులతో - నిజంగా మీరు నా బిడ్డలైతే చంద్రబాబును కత్తితో పొడిచి చంపి ఆ రక్తసిక్తకత్తిని నాకు చూపించాక తుది ఆకాంక్షను - ఒక కలకలం సృష్టించి హిందీ భాషాభిమానుల గుండెల్లో గూడుగట్టుకొని గాఢంగా పెనవేసుకు పోయాడు.

చరిత్ర వ్రాయడం గొప్పతనం కాదు పాఠకుడు తన రచన చదివి పారవశ్యం చెందాలనే లక్షణం కలిగిన డా॥ దగ్గుబాటి నిర్ధిష్ట లక్ష్యం చేరాడు. సక్సెస్, సక్సెస్ - గ్రాండ్ సక్సెస్ సుమా.

అన్ని సామాజిక శాస్త్రాలకు ప్రయోగశాల చరిత్ర - అంటూ ప్లేటో సూక్తిని సదాస్మరించే దగ్గుబాటి 28 సం॥ల క్రితమే యీ రాజకీయాలకు దూరంగా వుండి వుంటే - ఇంకా ఎన్ని వేల పేజీలు వ్రాసి వుండే వాణ్ణి గదా - అని డా॥ దగ్గుబాటికి మానసిక వ్యధ వుండి వుండవచ్చు.


ఇంతవరకు 13 అంతర్జాతీయ వేదికలపై భారతవాణిని వినిపించి రికార్డు సృష్టించిన శ్రీమతి పురంధేశ్వరికి యీ నా వురోగతి మా నాన్న యన్.టి.ఆర్. చూడలేకపోయారనే ఆవేదన ఆవిడది. 800 వికెట్స్‌తో ప్రపంచ రికార్డ్ సృష్టించిన మురళీ ధరన్‌కు తన టెస్ట్ రికార్డ్‌లో కనీసం ఒక్క సెంచరీనైనా చేయలేదనే అసంతృప్తి.

వ్యూహప్రతివ్యూహాలలో చిక్కుకొని వైస్రాయి హోటల్‌కు వెళ్ళడం, జీవితంలో క్షమించరాని తప్పుగా భావిస్తూ మానసికంగా కృంగికుమిలిపోయాడు డా॥ దగ్గుబాటి. దీనిని ఆయనే అక్షరబద్ధం చేశారు.

ముఖ్యంగా డా॥ దగ్గుబాటి పెద్దమనిషిలో ఎక్కువ లోకానికి తెలిసింది తక్కువ. మితంగా మాట్లాడతారు. డాక్టరు గారి లోపలి మనిషికి చాలా విషయాలు తెలుసు. 2009 నవంబరు 9న ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్న సువర్ణాక్షరాలు

ఆ లోపలి మనిషి నుండి ఎన్నో, ఎన్నెన్నో మరెన్నో లక్షల అక్షరాలు - వెలుగు జూసి - తెలుగునాట చరిత్రలో సువర్ణాక్షలుగా చోటు చేసుకోవాలని ఆసిస్తున్నాను.

తెలుగునాట కోటికెక్కిన రాజకీయ వేత్తలలో డా॥ దగ్గుబాటిది ఒక ప్రత్యేక వాణి. అంతేగాదు ఆయనది సరికొత్త బాణి, ముందు,




ముందు, విశ్వంలో ఆయన రచనలు ఏ భాషలో అనువదించినా – పది కాలాలపాటు చరిత్రలో పచ్చగా నిలిచిపోయే పసగలరచనలు

చదువుతూవుంటే పదే పదే నిలబెట్టి పలుకరించేవిలువైన రచనలు. పదునైన రచనలు. ఆయన కలం నుండి గళం నుండి వెలువడిన ప్రతి రచన బుక్కుగా, హృదయ స్రుక్కుగా, నిలువుటద్దంలో నిటారుగా కన్పిస్తూ వుంటుంది.

ఇక రచనల విషయాన్ని సమీక్షిస్తే సూక్ష్మాతిసూక్ష్మంగా విశ్లేషించి చూపే, పదునైన శక్తి, యుక్తులతో మన కళ్ళ ముందు ప్రత్యక్షమవుతాయి. అంతలోనే అంబరాల కెగరేసి, అంతలోనే అవనికి విసిరివేసేవి కావవి. అంతరాంతరాళాలలో కుదురుగా కూర్చొని హేతువాద దృష్టితోనే ప్రశ్నిస్తూనే వుంటాయి. ఆయన పరిశీలనా శక్తికి, మరువలేని, మరువరాని సంకేతాలు. వైజ్ఞానిక, తాత్విక రంగాలలో డా॥ దగ్గుబాటి ఎన్నివేల పేజీలు రెఫరెన్స్ చేశారో, ఆయన సాధించిన అగస్త్యతకు తిరుగులేని దృష్టాంతాలు.

ఆయన కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతకర్త కారల్ మార్క్సును గురించి వ్రాస్తూ చరిత్ర గమనాన్ని మార్క్స్ మార్చినంతగా మరేతత్వవేత్త మార్చలేదని, ఇంతకు ముందు తత్వవేత్తలు ప్రపంచాన్ని నిర్వచించడానికి ప్రయత్నించారని, అయితే కారల్ మార్క్స్ ప్రపంచాన్ని మార్చడం నా సంకల్పం అన్నాడని డా॥ దగ్గుబాటిగారు ఖరాఖండితంగా వ్రాశారు.

మార్క్సిజం ఎల్లప్పటికీ యధాతథంగా ప్రపంచానికి అర్థం చెప్పడానికి సరిపోతుందని అనుకోవడం మార్క్సుకే అపచారం చేసిన వారమవుతామని డా॥ దగ్గుబాటి పేర్కొన్నారు. తన్ను శంకించమని, ప్రశ్నించమని, మార్క్సిజమే మనకు బోధిస్తుంది. ఇది మార్క్స్ గొప్ప తనం సుమా అంటూ పేర్కొన్నారు.

ఇక్కడ దగ్గుబాటి మన కళ్ళముందు ఒక గొప్ప మార్క్స్ అభిమానిగా ప్రత్యక్షమవుతారు.

ఆయన జాతిపిత మహాత్మాగాంధీని గురించి వ్రాసిన 6 పేజీల వ్యాసంలో 'కమ్యూనిస్టు, ముఖ్యంగా రచయిత మహోధీర రామమోహనరావు వ్రాసిన మాటలను పరోక్షంగా గుర్తుచేశారు. భారత జాతిని ఏక్ ధాటిగా 50 సం॥ల పాటు – సిట్ అంటే సిట్, స్టేండ్ అంటే స్టేండ్ అంటూ గాంధీ నడిపించారనేది చరిత్ర పుటలలో దాగిన నగ్న సత్యం అనేది.

ముఖ్యంగా మరో 100 సం॥లు గడిస్తే 206 ఎముకలతో రక్తమాంసాలు కలిగిన ఒక వ్యక్తి – భారతస్వాతంత్రోద్యమంలో యింత పోరాటం చేశాడా అనేది – విశ్వం విశ్వసించదని – ఐన్‌స్టీన్ మాటలను డా॥ దగ్గుబాటి గుర్తుచేశారు. డా॥ దగ్గుబాటి ప్రపంచతత్వం, నాయకత్వం వ్రాసేముందు ఒక్క విషయాన్ని మాత్రం – సదాస్మరిస్తూనే వుంటాడు.


తత్వశాస్త్ర చరిత్రగాని, మరే చరిత్రగాని తెలుసుకోదల్చినప్పుడు ప్రతియుగానికి కొన్ని సాంకేతిక పదాలుంటాయని, కొన్ని కొన్ని భావాలను స్ఫురింపచేయడానికి యీ పదాలు వుపయోగించబడతాయని కాలం గడిచినకొద్దీ యీ పదాలు మారేది వుండవని – దాని సారాంశం – ఏదిఏమైనా ప్రపంచతత్వం – నాయకత్వం (క్రీ.పూ. 470 – క్రీ.శ 2010) గ్రంథాన్ని డా॥ దగ్గుబాటి 214 పేజీలతో ముగించారు. 50 మంది ప్రపంచప్రఖ్యాతి గాంచిన తాత్వికులు, నేతల జీవితాలు ఇక్కడ పెనవేసుకుపోయాయి. 1991 లో ప్రపంచ పర్యటన చేశానని, తత్ఫలితంగా పఠించిన గ్రంథాలు, సేకరించిన అమూల్య పుస్తక సంపదలు ఒక క్రమంలో చేర్చి భావితరాలకు అందించాలనేది నా తపన అంటూ ముందు మాటలో వ్రాశారు.

అయితే యీ పుస్తకంలో పొందుపరచని ప్రపంచ ఖ్యాతిగాంచిన మరెందరో మహోన్నత వ్యక్తులకు యీ నా సంకలనం అంకితం అంటూ వ్రాసిన యీ వాక్యంపై 214 పేజీల గల యీ పుస్తక పఠనం ముందు – 214 నిమిషాలు చర్చిస్తేనే గాని – చరిత్ర పుటలలో వెలుగులోకి రావలసిన ఆ మహోన్నత మహా వ్యక్తులెవరో తెలుసుకోవాలనే తపన – మెదడు నాళాలలో పెనవేసు కుపోయేటంత ఉత్కంఠత అదే డా॥ దగ్గుబాటి వదలిన బాల విలుకాని బాణం – సూటిగా – ఘాటుగా మనఃఫలకంపై నాటుకుపోయింది సుమా!

స్థలాభావం వలన నేను వివరించలేకపోతున్నాను. "ప్రపంచతత్వం – నాయకత్వం' ఇంగ్లీషులోకి అనువదించి బ్రిటీష్ మ్యూజియం గ్రంథాలయానికి పంపవలసిన గ్రంథమిది. దీని నేపథ్యం విస్మరించరానిది డా॥ దగ్గుబాటి – పద్మశ్రీ, పద్మభూషణ, పద్మవిభూషణ, జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత లెందరో ఆయా పుస్తకాలకు, ఆయా భాషలతో వ్రాసిన పీఠిక సుస్పష్టంగా అధ్యయనం చేసినట్లు మనకు కనిపిస్తూ వుంది.

ఏది ఏమైనా, సిద్ధాంతరీత్యా విభేదాలుండవచ్చు. అయినా త్యాగాలను ఎలా మరువగలం? అనేది ఆయన ఆలోచనా సరళి.

ఈనాటి యువతరానికి, రాజకీయాల పట్ల, రాజకీయ నాయకత్వం పట్ల సరైన అవగాహన కొరవై చుట్టూ వున్న అవినీతి రాజుల్ని చూసి రాజకీయాలంటే ఇంతే అనుకుంటున్నారు. యీనాటి యువతరం నుంచి అటువంటి అపోహలు తొలగించి యుక్తాయుక్త విచక్షణ పెరగడానికి యీ రచన దోహదపడాలని ఆకాంక్షిస్తూ.



**– వలేటి వెంకటేశ్వర్లు,**
రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఇంకొల్లు.

# డాక్టర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు...

## సందిరెడ్డి కొండలరావు - ఎడిటర్










# చిరంజీవ! చిరంజీవ! డాక్టర్ జీ!
# విజయీభవ! దిగ్విజయీభవ!!



ప్రియాతి ప్రియమైన డాక్టర్ జీ!
ఇది యాదృచ్ఛికమో, మరేమోగాని
మానవాళికి ప్రేమ, కరుణ, క్షమా మార్గాన్ని చూపిన
మహాప్రవక్త యేసుక్రీస్తు!
ప్రపంచాన్ని భయంకర ఫాసిజం బారినుండి కాపాడిన
మహానేత స్టాలిన్!
ప్రఖ్యాత మేధావి, కమ్యూనిస్టు చైనా నిర్మాత
మహో సేటుంగులు!
జన్మించిన 'డిసెంబరు'లోనే మీరు జన్మించారు!
అందుకు మా హృదయపూర్వక అభినందనలు!
మీకు యాభై తొమ్మిదవ జన్మదిన శుభాకాంక్షలు!
14.12.1953న కారంచేడు గ్రామంలో
దగ్గుబాటి రమాదేవీ, చెంచురామయ్యలకు
మూడవ ముద్దుబిడ్డగ జన్మించిన డా॥ దగ్గుబాటీ!
చిరంజీవ! చిరంజీవ! విజయీభవ! దిగ్విజయీభవ!
తల్లీ, తండ్రి, గురువల ద్వారా విద్యాబుద్ధులు, క్రమశిక్షణను,
బంధువు దుర్గయ్య ద్వారా నిరాడంబరత, సదాశయాలను,
శరత్, గాంధీ, నెహ్రూల వంటి ప్రముఖుల రచనల ద్వారా
సమరస, శాంతి, ఆధ్యాత్మిక, అభ్యుదయ భావాలను,
నీ హృదయం నిండా నింపుకున్నావు డాక్టర్ జీ!
వైద్య విద్య, వినయ, సౌందర్య, సౌశీల్యాదులతో

ఎన్టీఆర్‌ను మెప్పించి, పురంధరేశ్వరి విభునివయ్యావు!
నివేదిత, హితేష్‌లకు జన్మ ప్రదాతవు, ఇటీవలె
శ్రేష్ఠ, జయరామ్ లకు తాతయ్యవూ అయ్యావు!
విద్యార్థినాయకునిగ! తెలుగుయువత నేత!
శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభలకు సభ్యునిగ!
ఆరోగ్యశాఖ మంత్రిగ! అలుపెరుగని ప్రజాసేవకునిగ!
అజేయ ప్రజాప్రతినిధిగ! నీతినిజాయితీల ప్రతిబింబముగ!
స్త్రీ అభ్యుదయ వాదిగ! సామాజిక స్పృహగల రచయితగ!
వ్యాసకర్తగ, సినీ నిర్మాతగా, బహుళరంగాలలో
ప్రజలకు సేవలందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలీ!
డా॥ దగ్గుబాటీ బహుపరాక్! బహుపరాక్!
ఇలాగే, ఇలాగే ఇంకా, ఇంకా మంచి మనిషిగ!
మహోన్నత ప్రజా సేవకునిగ! మానవతామూర్తిగ!
భారతదేశానికే ప్రథమ పౌరునిగ! మీరు ఎదగాలని
మనసారా కోరుకుంటున్నాను డాక్టర్ జీ!
అందుకు అవకాశాలను, ఓర్పు, నిగ్రహాది శక్తియుక్తులను,
పూర్ణ ఆయురారోగ్యాలను, పరమేశ్వరుడు మీకు
సంపూర్ణముగా సమకూర్చుగాక! సర్వదా మీకు
చిన్నమ్మగారికి, మీ కుటుంబ సభ్యులందరికీ శుభమస్తు!
తథాస్తు! తథాస్తు! తథాస్తు!



క్రీస్తు



స్టాలిన్



మావో



**– పాతూరి వెంకటేశ్వరరావు**
సెల్ : 9849081889

# జగన్ రాజకీయ భవిష్యత్తు ఏమిటి?

- ఇలపావులూరి మురళీమోహన్‌రావు సెల్ : 9866194944



ఇప్పుడంటే దివంగత రాజశేఖరరెడ్డి మీద అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి కానీ – ఆయన పరిపాలించినంత కాలం రాష్ట్ర ప్రజలకు 'నెప్పి' అన్నది తెలియలేదు. ఐదు సంవత్సరాలపాటు రాష్ట్రంలో ఏ రంగంలోనూ 'పన్నుపోటు' అన్నది కనిపించలేదు. ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలం పన్నులు పెంచకుండా పరిపాలన చెయ్యడంతో పాటు – రెండు డజన్లకు పైగా సంక్షేమపథకాలను నిర్విఘ్నంగా అమలు జరపడం రాజశేఖరరెడ్డికే చెల్లింది. తన సంక్షేమ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత ఏ ముఖ్యమంత్రి సాధించలేనంత ప్రజాదరణను చూరగొన్న రాజశేఖరరెడ్డి పాలనాకాలంలో కాంగ్రెస్ అధిదేవతలు రాష్ట్ర ప్రజల దృష్టిలో పూర్తిగా కనుమరుగైపోయారు. 'కాంగ్రెస్ అంటే రాజశేఖరరెడ్డి మాత్రమే' అనేంతగా రాజశేఖరరెడ్డి ఆధిపత్యం కొనసాగింది. అయితే ఆయన హఠాన్మరణం తరువాత ఆయన వారసునిగా జగన్ తెరపైకొచ్చాడు. తాను రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని ఆశించాడు.

రాష్ట్రంలో తమ పార్టీయే అధికారంలో ఉన్నా, తమ పెత్తనం ఏ మాత్రం సాగడం లేదని కుతకుతలాడిపోతున్న కాంగ్రెస్ అధిష్ఠానం – జగన్ దూకుడుకు అడ్డుకట్టవేసి వృద్ధసింహం రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. దాంతో రగిలిపోయిన జగన్ – తన భవిష్యత్తును శూన్యంగా ఊహించుకుని తిరుగుబాటు చేశాడు. పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసి బయటకొచ్చాడు. నిజానికి జగన్మోహన రెడ్డి ఓర్పుగా వ్యవహరించి పార్టీకి విధేయుడిగా కొనసాగి ఉన్నట్లయితే రోశయ్య తరువాత ఆయనకు అవకాశం వచ్చి ఉండేదేమో. కానీ ఆలోచనా రహితంగా వ్యవహరించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసి, పార్టీకి దూరమై, ఓదార్పు యాత్ర పేరిట జనారణ్యంలోకి దూకాడు. జగన్ బయటకు రాగానే వైయస్ రాజశేఖర్ రెడ్డిని మహా అవినీతి పరుడిగా, లక్షల కోట్ల దోపిడీదారుగా కాంగ్రెస్‌తో సహా తెలుగుదేశం సైతం చిత్రించడం మొదలైంది. వాస్తవానికి పన్నులు పెంచకపోవడంతోపాటు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ ఫీజుల రీయింబర్స్‌మెంట్, రెండు రూపాలయకే కిలో బియ్యం, జలయజ్ఞం లాంటి పథకాలను

వైయస్ఎలా అమలు చేశాడో ప్రపంచంలోని తలపండిన ఆర్థిక వేత్తలందరూ పరిశోధించాల్సిన విషయం. వేలకోట్ల రూపాయలు అవసరమైన ఇలాంటి పథకాలకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఐదు సంవత్సరాలపాటు ఇన్నిన్ని పథకాలను నిరాటంకంగా అమలు పరచడమంటే మాటలు కాదు. వీటికి నిధులు కేంద్రం ఇచ్చిందా? మరెవరిచ్చారు? వైయస్ బ్రతికుంటే మరో అయిదు సంవత్సరాలు ఈ పథకాలు కచ్చితంగా అమలయ్యేవి. ఆర్థిక వేత్తలని మనం పొగిడే మన్మోహన్ సింగ్ హయాంలో అన్ని రకాల ధరలు పెరగడమే కానీ తరగడం చూడటం లేదు. ఆర్థిక నిపుణుడని మనం కీర్తించిన రోశయ్య హయాంలో రవాణా చార్జీలు, ఇంటి పన్నులు విపరీతంగా పెరిగిపోయాయి. అంతేకాకుండా సంక్షేమ పథకాలన్నీ చతికిల పడిపోయాయి. దీన్ని బట్టి చూస్తే సంక్షేమ పథకాలన్నీ రాజశేఖర రెడ్డివే కానీ కాంగ్రెస్ పార్టీ పథకాలు కావని స్పష్టమై పోతుంది. అంతేకాకుండా తన రాజకీయ చాణుక్యంతో తెలంగాణా రాష్ట్ర సమితిని నేలమట్టం చెయ్యగలిగాడు ఆయన. రాజకీయ పరవిషయాలు పక్కన బెడితే – ప్రజలపై ఏ మాత్రం భారం లేకుండా ఐదు సంవత్సరాలు వై.ఎస్ ఎలా పరిపాలించగలిగాడన్న విషయం తేల్చకుండా వైయస్ లక్షల కోట్లు కాజేశాడనే దౌర్భాగ్య ప్రచారం చేసే స్థితికి రాష్ట్ర కాంగ్రెస్ దిగజారిపోయింది. తన ప్రతిభతో రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా వైయస్ నిలిచిపోయాడనేది తిరుగులేని వాస్తవం. అదే ఇప్పుడు జగన్‌కు పెట్టుబడిగా మారింది.

2009 ఎన్నికల వరకు రాష్ట్ర ప్రజలకు జగన్ పేరు పెద్దగా పరిచయం లేదు. వైయస్ తనయుడిగా ఆయన కొద్దిమందికి మాత్రమే పరిచితుడు. సాక్షి దినపత్రిక, టీవీ ఛానెల్ ఆరంభమైన తరువాత జగన్ పేరు జనబాహుళ్యానికి తెలిసి వచ్చింది. వై.యస్.మరణం తరువాత కొంతమంది ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక మరణించారని వార్తలు వచ్చాయి. మనదేశంలో ఈ సెంటిమెంటు ఇందిరా గాంధీ కాలం నుంచి మొదలైంది. ఇందిర హత్యను భరించలేక కొంతమంది గుండెపోట్లు తెచ్చుకొని మరణించారు. ఎం.జీ.ఆర్. మరణాన్ని తట్టుకోలేక దాదాపు ఎభైమంది చనిపోయారు. ఎన్టీఆర్ మరణాన్ని భరించలేక కొంతమంది అభిమానులు ప్రాణాలు విడిచారు. అలాగే వైయస్‌మరణాన్ని తట్టుకోలేక నాలుగొందలమందికి పైగా మరణించారని చెబుతున్నారు. 'మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ వంటి మహానాయకులు గతించినప్పుడే ఇన్ని వందల మంది చావలేదు. వైయస్.కోసం ఇంతమంది చస్తారా?' అని వి. హనుమంతరావు లాంటి బుద్ధిహీన బానిసలు వదరినా, వైయస్ కోసం కొంతమందైనా మరణించారనేది నిజం. వారిని పరామర్శించి, కొంత ఆర్థికసాయం అందించాలని జగన్



అనుకుంటే అందుకు అభినందించాల్సిందే. అయితే ఇదే అదునుగా జగన్ జనంలోకి దూకి తన సొంత ఇమేజ్‌ను పెంచుకుంటాడని పసిగట్టిన రాష్ట్ర నాయకులు కొందరు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దాంతో అధిష్టానం కంగారు పడి జగన్ యాత్రను అడ్డుకోవడానికి నిశ్చయించింది. ఫలితంగా జగన్‌కు, అధిష్టానానికి తెగ తెంపులయ్యాయి. జగన్ యాత్ర మొదలైంది.

## నిజంగా ఓదార్పేనా?


రాష్ట్రం నలుమూలలా ఉన్న నాలుగొందల కుటుంబాలను వ్యక్తిగతంగా పరామర్శించి ఓదార్చడానికి మహా అయితే నెలరోజుల సమయం సరిపోతుంది. ఆ విధంగా చేస్తే బాధిత కుటుంబాలకు వెంటనే ఓదార్పు దక్కేది. కానీ జగన్ ఈ యాత్రను తన రాజకీయ ఎదుగుదలకు వాడుకోవడంతో ఓదార్పు యాత్ర అంతూపొంతూ లేకుండా సాగిపోతున్నది. దీనితో జగన్ 'అసలు లక్ష్యం' వేరే ఉన్నదన్న విషయం అందరికీ అర్థమైపోయింది. కుటుంబంలోని వ్యక్తి ఎవరైనా చనిపోతే, ఒకటి రెండు నెలలో ఆ బాధను కుటుంబసభ్యులు క్రమేపీ మర్చిపోతారు. కాంగ్రెస్ అధిష్టానం ఊహించినట్లుగానే ఓదార్పు యాత్ర దండయాత్రలా పరిణమించింది. వై.యస్. పట్ల ప్రజల్లో ఉన్న అభిమానం ఏనాటికీ చెరిగిపోనిదికావడంతో ఈనాటికీ జగన్ ఎక్కడకు వెళ్ళినా జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఈ అభిమాన మంతా దివంగతనేత మీదనే కానీ తన మీద కాదని జగన్ గ్రహించలేకపోవడంతో అతి తెలివికి పోయి తనకు తానే చిక్కులు కొనితెచ్చుకుంటున్నాడు జగన్మోహన్‌రెడ్డి. వైయస్‌ను అభిమానించడానికి, ఆరాధించడానికి ప్రజలకు లక్ష కారణాలున్నాయి. కానీ జగన్‌ను ఆరాధించడానికి ప్రజల వద్ద ఒక్కకారణం కూడా లేదని తెలుసుకోకపోతే జగన్ రాజకీయ భవిష్యత్తు అంధకారమౌతుంది.

## ఇది అనైతికం కాదా?

జగన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

చేసినపుడు తన ఎంపీ పదవికి రాజీనామా చేశాడు. అలాగే తన తల్లి విజయమ్మ చేత కూడా శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేయించాడు. ప్రజాస్వామ్యంలో ఈ చర్యను ఉన్నత విలువలను కాపాడటంగా భావించవచ్చు. తన వరకు రాజకీయ విలువలను జగన్ పాటించాడు. మరి జగన్‌తో తిరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.ఏ.ల మాటేంటి?

సి.బి.ఐ. తన చార్జ్‌షీట్‌లో వైయస్ పేరు చేర్చిందనే వంకతో దాదాపు ముప్ఫై మంది ఎంఎల్.ఏ.లు జగన్ వర్గంగా రూపొందారు. వారందరికీ ఆగ్రహం కలిగిందట. అంటే రాష్ట్ర కాంగ్రెస్‌కున్న నూట యాభై అయిదు మంది శాసనసభ్యులలో వై.యస్.ను అభిమానించేవారు కేవలం ముప్ఫైమందేనా? మిగిలిన నూట పాతికమందికి వైయస్. మీద అభిమానం లేదనుకోవాలా? ఇది దివంగత నాయకుడిని అవమానించడం కాదా? వీరిలో ఎవరికైనా ప్రజాస్వామ్యం పట్ల అవగాహన ఉంటే వారు తమ పదవులకు కూడా రాజీనామాలు చేసి ఆమోదింపజేసుకుని తిరిగే వైయస్‌పార్టీ గుర్తు మీద పోటీ చేయాలి కదా. ఆ విధంగా చెయ్యకుండా మొక్కుబడి రాజీనామాలు సమర్పించి – ఆ తరువాత వాటిని ఆమోదించవద్దని స్పీకర్‌ను ప్రాధేయపడిన వారే ఎక్కువ. వీరు కాంగ్రెస్ టిక్కెట్ మీద గెలిచి వేరే పార్టీ సమర్ధకులుగా తయారవడం ఎంతవరకు సమంజసం? వీరిలో కాటసాని జయసుధ లాంటి గోడమీద పిల్లులు ఇరవైమంది వరకూ ఉన్నారు. కొంతకాలం కాంగ్రెస్ వైపు అంటారు.



కొంతకాలం జగన్ వైపు అంటారు. వేరే పార్టీ శాసనసభ్యులను తన వారిగా చెప్పుకోవడంలో నైతికత ఉందా?

ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీని స్థాపించినపుడు ఎన్టీఆర్ వ్యవహరించిన తీరును స్మరించుకోవాలి. తెలుగుదేశం పార్టీని ప్రకటించినపుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ నాటికి పార్టీ ఫిరాయింపుల చట్టం లేదు. వారు నిస్సంకోచంగా తెలుగుదేశం ఎమ్మెల్యేలు గా చెలామణీ కావడానికి ఎలాంటి అడ్డంకులు లేవు. అయినా సరే – వారందరినీ రాజీనామాలు చేసి తమ పార్టీలోకి రావాలని ఎన్టీయార్ కోరారు. వారావిధంగా చెయ్యకపోవడంతో ఎన్టీయార్ వారిని పార్టీలోకి చేర్చుకోలేదు. తనదంటూ ప్రత్యేక సైన్యాన్ని తయారు చేసుకున్నాడు. దేవేందర్ గౌడ్, యనమల రామకృష్ణుడు, గాలి ముద్దువంటి నేటి అనేక మంది తెలుగుదేశం నాయకులు ఎన్టీయార్ వెలుగులోకి తెచ్చిన నాయకులే. జగన్ కూడా తన పార్టీలోకి రాదల్చుకున్నవారు తమ పదవులకు రాజీనామాలు చెయ్యాలని షరతు విధించినట్లయితే ప్రజాస్వామ్యం విలువల పట్ల గౌరవం కలిగిన వ్యక్తిగా ఆయన పేరు మోగిపోయేది. ఆ విధమైన ప్రమాణాలను జగన్ పాటించకపోవడంతో జగన్ పలుచనయ్యాడు.

## సీబీఐ కేసులు :

కాంగ్రెస్ పార్టీలో ఉన్నంతకాలం జగన్ ఎన్ని వ్యాపారాలు చేసినా, వేలకోట్ల రూపాయలు ఆర్జించినా ఎలాంటి విచారణలూ లేవు. సొంతపార్టీ పెట్టుకోగానే సీబీఐ విచారణలు మొదలయ్యాయి. అవి ఎంత ధాటిగా సాగాయంటే జగన్ ఏ క్షణంలోనైనా జైలుకెళ్ళడం ఖాయం అనేంతగా. పాపం – కొన్ని పత్రికల వారు జగన్ జైలుకు వెళ్ళినట్లుగానే ఊహించుకుని ప్రతిరోజు కార్టూన్లు కూడా ప్రచురించారు. ఇంతలోనే హఠాత్తుగా జగన్ ఢిల్లీ పర్యటించడం అక్కడి కాంగ్రెస్ పెద్దలను కలవడం – ఆ సాయంత్రమే కేంద్రంలో యూ.పి.ఎ.ను బలపరుస్తామని చెప్పడం ఆయన్ను పిరికివాడిగా లోకానికి చాటి చెప్పింది. మాట తప్పనివాడు – మడమ తిప్పనివాడు గా ఆయన చేసుకున్న స్వకుచ మర్ధనాన్ని పరిహాసం పాలు చేసింది. ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలు నిజమేనన్న సందేహాలను రేకెత్తించింది. దానికి తగ్గట్లుగానే ఆ మర్నాటి నుంచే సీబీఐ దండయాత్రలు

కాకినాడ – తిరుపతి ప్యాసెంబర్ మాదిరిగా డెడ్‌స్లో అయ్యాయి. ఆయనలోని విశ్వసనీయతను దెబ్బతీసింది. అప్పటి నుంచే జగన్ వెనుక నిలచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పునరాలోచన లో పడడం ప్రారంభమైంది. నాయకుడే వెళ్ళి సోనియా శరణుజొచ్చిన తరువాత తమబోటి అల్పులెంత అని భావించడానికి ఆస్కారమిచ్చింది. చిరంజీవికి, జగన్‌కు పెద్ద తేడా లేదని అభిప్రాయం కలిగించింది.

## బలమున్నా ఏం లాభం ?

తండ్రి పుణ్యమా అని జగన్‌కు ప్రజాదరణ ఏర్పడింది. జగన్‌కు ఏదో అన్యాయం జరిగింది అన్న భావన ప్రజలలో కలిగింది. ఫలితంగా జగన్ ఎక్కడికెళ్ళినా జనం నీరాజనాలు పలుకుతున్నారు. నిజం చెప్పాలంటే జనం అంత ఎత్తున తన వెంట పడటానికి జగన్ చేసిన ప్రజాసేవ ఏమీ లేదు. కేవలం వై.యస్. కుమారుడిగానే ఆయనకు అంత జనాదరణ లభిస్తున్నది. దానిని ఆలంబనగా చేసుకుని తన పార్టీని విస్తృతపరచుకుని తనకంటూ ప్రతినియోజకవర్గంలో ఒక బలమైన అభ్యర్థిని తయారు చేసుకోవలసిందిపోయి వైరి పక్షంలోని శాసనసభ్యులను తన వర్గంగా చెప్పుకోవడం, వారికి ఆదేశాలివ్వడం ఏమి నైతికత? రేపు తన పార్టీ ద్వారా గెలిచిన వారెవరైనా కాంగ్రెస్ లేదా తెలుగుదేశం పార్టీ అధినాయకులను సమర్థిస్తూ వారి వెంట తిరుగుతుంటే జగన్ సహించ గలడా? ఇటు వంటి నీతి మాలిన రాజకీయాలను ఇకనైనా స్వస్తి చెప్పడం జగన్‌కు మంచిది.

## అవలక్షణాలే అధికం :

నాయకత్వ స్థానంలో ఉన్నవాడు తను ధైర్యంగా ఉండడంతో పాటు అనుచరులకు కూడా ధైర్యం నూరిపోస్తుండాలి. అనుచరులను సంప్రదిస్తూ వారి అభిప్రాయాలను గౌరవించాలి. వారి సలహాలకు విలువ ఇవ్వాలి. అందరినీ కలుపుకుపోవాలి. గడ్డిపోచకు కూడా కొంత విలువ ఉంటుందని గ్రహించాలి. అనుచరుల మాటను వినకపోయినా – విన్నట్లుగా కనిపించాలి. కానీ జగన్‌లో ఇలాంటి లక్షణాలు ఎక్కడా కనిపించడంలేదు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్న చందంగా జగన్ ప్రవర్తన గోచరిస్తున్నది. వ్యూహాలు రచించడంలో అనేక సార్లు ఆయన అవివేకం ప్రస్ఫుటమౌతున్నది. లేకపోతే 'ఈ ప్రభుత్వం నా దయాదాక్షిణ్యాల మీద నడుస్తున్నది. నేను తల్చుకుంటే ఒక్క క్షణంలో ఈ ప్రభుత్వం కుప్పకూలిపోతుంది వంటి ఆలోచనా రహిత ప్రకటనలు జగన్ నుంచి రావు. తన ఆజ్ఞలు పాటించి తన వర్గ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తే ప్రభుత్వం సంగతేమోకానీ – ముందు ఆ ఎమ్మెల్యేలు మాజీ అయిపోతారు. ప్రభుత్వాన్ని పడగొట్టగల శక్తి తనకుందా లేదా అనే అంచనాయే లేకుండా జగన్ అలా ప్రకటించాడంటే అతని రాజకీయ అజ్ఞానం ఏ స్థాయిలో ఉందో అర్థమౌతుంది. అదే జగన్ అంతకు ముందు 'నా తండ్రి రెక్కల కష్టంతో ఏర్పడిన ఈ ప్రభుత్వాన్ని పడగొట్టడం నాకిష్టం లేదు' అని పలుమార్లు ప్రకటించాడు. 'నా మీద ఏ విచారణనైనా వేసుకోండి' అని అనేకసార్లుసవాళ్ళు విసిరిన జగన్ తీరా సీబీఐ ఎంక్వైరీ వెయ్యగానే దాన్ని తప్పించుకునే మార్గాలు అన్వేషించాడు. ఇటువంటి అనేక ఉదాహరణలు జగన్‌కు మాట నిలకడ లేదనే విషయాన్ని ఋజువు చేస్తున్నాయి. ఒక యువనాయకుడిలో ఉండవలసిన లక్షణాలు ఇవి కానేకావు.

## బలాలు – బలహీనతలు :

ఏదెలా ఉన్నా జగన్ ప్రజాకర్షక నేత అనడంలో సందేహం లేదు. స్థూలంగా ఆయనలో ఉన్న బలాలు–బలహీనతలు చూస్తే కొన్ని విశేషాలు బయటపడతాయి.

**బలాలు :**

1. వారసత్వంగా వచ్చిన జనాదరణ
2. మంచి వాగ్ధాటి
3. ఆర్థిక పరిపుష్టి
4. సామాజిక బలం
5. తండ్రి ఇమేజ్
6. జనంలోకి చొచ్చుకుపోవడం

**బలహీనతలు :**


1. ఎవరినీ నమ్మకపోవడం
2. తనమాటే చెల్లుబాటుకావాలనే రెటమతం
3. పైకి కనిపించని పిరికితనం
4. మాట నిలకడలేని తనం
5. ఇతర పార్టీవారిని తరవారనుకుని భ్రమించడం
6. కలుపుగోలు లేనితనం
7. మళ్ళీ కాంగ్రెస్‌లో కలుస్తాడనే సందేహానికి తావివ్వడం.
8. అనుచరుల భవిష్యత్తుకు భరోసా కల్పించలేకపోవడం
9. పట్టువిడుపులు లేని మొండితనం
10. సహచరులలో ప్రథముడిలా ప్రవర్తించక కమాండర్‌గా వ్యవహరించడం
11. జనాదరణతో కొత్త జట్టును నిర్మించలేకపోవడం
12. యుద్ధం మొదలుగాకముందే సంధి ప్రయత్నాలు చెయ్యడం
13. విజ్ఞత, విచక్షణ లోపించడం
14. ఆలోచించాల్సిన తరుణంలో ఆవేశానికి లోను గావడం
15. స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోవడం

ఎంచి చూస్తే జగన్‌లో బలాల కంటే బలహీనతలే అధికంగా కనిపిస్తున్నాయి. ఎన్ని బలహీనతలున్నా ఏనాటికైనా ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాగలడనే ఆశావహులు చాలా ఎక్కువశాతం ఉన్నారు. దానికి తగ్గట్టుగానే కాంగ్రెస్‌లో, తెలుగుదేశం పార్టీలలో ప్రజాకర్షకనాయకులు కరువయ్యారు. చిరంజీవిని చూస్తారు తప్ప ఓట్లు వెయ్యరు. చంద్రబాబును మరో పది జన్మలెత్తినా ప్రజలు నమ్మరుగాక నమ్మరు. కాబట్టి జగన్‌కు మంచి భవిష్యత్తు ఉండే అవకాశమే ఎక్కువ. కొన్ని పత్రికలు, చానెల్స్ జగన్‌కు మద్దతునిస్తున్నాయి. తనకున్న ప్రజాదరణను సక్రమమైన రీతిలో ఉపయోగించుకుంటే జగన్ రాణించగలడనడటంలో సందేహం లేదు. కాకపోతే స్వీయ లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడం జగన్‌కు అవసరం. ఆయనకు అందుకు తగిన సమయం ఉంది. ముందుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వారి మానాన వారిని వదిలెయ్యడం తనకంటూ నాయకులను తీర్చిదిద్దుకోవడం, ఓదార్పు యాత్రలను సత్వరమే ముగించి ప్రజాసమస్యల పట్ల దృష్టిసారించి వారి తరుపున పోరాడటం జగన్ తక్షణ కర్తవ్యం.

******

# అవిశ్వాసంలో అంతిమ విజయం ఎవరిది

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కామన్న సంతోషం లేకుండా పోయింది. ప్రతిపక్ష నాయకుడు ఎన్.చంద్రబాబునాయుడు తన మీద కురుస్తున్న విమర్శల జడివాన నుంచి తప్పించుకోవడానికే అన్నట్లుగా ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని అధికారపక్షం ఓడించి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుగా ప్రభుత్వాన్ని నిలబెట్టుకో గలిగారు. అయితే కాంగ్రెస్ పార్టీకే చెందిన 16 మంది ఎమ్మెల్యేలు 'తూచ్...!' అంటూ అధికారపక్షం ఇచ్చిన విప్ (ఆదేశాన్ని) ఉల్లంఘించి అవిశ్వాసానికి మద్దతు పలకడం ముఖ్యమంత్రికి గట్టి ఎదరు దెబ్బగా పరిణమించింది. పీఆర్పీ నుంచి ఒక ఎమ్మెల్యే, టీపీపి నుండి మరో ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఆయన నిర్ణయం ప్రకారం అవిశ్వాసానికే ఓటేశారు. గతంలో రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశ రాజకీయాల్లో కూడా పార్లమెంటు స్థాయిలో ఇలాంటి సంఘటన జరుగలేదు. సాధారణంగా అవిశ్వాస తీర్మానం గట్టెక్కడానికో, లేదా ఒక అధికార పక్షం విశ్వాస పరీక్ష నెగ్గడానికో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, లేదా ఎంపీలను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకోవడం ఇప్పటి వరకూ భారత పార్లమెంటరీ రాజకీయాల్లో జరిగింది. కానీ ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నంగా జరిగింది. అవిశ్వాస తీర్మానాన్ని పురస్కరించుకుని సొంత పార్టీ సభ్యులే అధికారపక్షంపై తమకు విశ్వాసం లేదని ప్రకటించిన అరుదైన సంఘటన ఇది. వాస్తవానికి ఇది కాంగ్రెస్ పార్టీకి పెద్ద కుదుపే...! జగన్ కనుక గట్టిగా మరో కుదుపు ఇచ్చి ఉంటే ప్రభుత్వమే పడిపోయేదని ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. సామాన్య ప్రజల్లో కూడా ఇదే చర్చగా ఉంది.





అసెంబ్లీ సాక్షిగా అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అసలు రంగు ఏమిటో తెలుగు ప్రజలు తెలుసుకోగలిగారు. అవిశ్వాసం పెడితే తడాఖా చూపిస్తామని జగన్ కొద్ది నెలల క్రితం తొడగొట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా పదే పదే టీడీపీకి సవాళ్ళు విసిరారు. కానీ తీరా సభలో టీడీపీ తీర్మానం పెట్టేటప్పటికీ ప్రభుత్వాన్ని పడగొట్టడంలో జగన్ విఫలం అయ్యారు. ఈ ఏడాది ఆరంభం వరకూ జగన్‌కు సుమారు 30 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండేది. తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలలో కూడా గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకునే జగన్ వర్గం అవిశ్వాస తీర్మానం పెట్టమంటూ కోరుతూ వచ్చింది. అప్పట్లో చంద్రబాబు అవిశ్వాసం వైపు మొగ్గు చూపలేదు సరికదా, కనీసం ఆ ఊసెత్తడానికి కూడా జంకారు. అప్పట్లో కనుక అవిశ్వాసం పెట్టి ఉంటే ప్రభుత్వం పడిపోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఓ వైపు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మరో వైపు తన చేతిలో ఉన్న అవిశ్వాస తీర్మానం అనే అస్త్రాన్ని చంద్రబాబు సంధించకపోవడం పరిశీలకుల్లో కూడా విమర్శలకు దారి తీసింది. రైతులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ యాత్రలు చేస్తున్న చంద్రబాబు అవిశ్వాసం కనుక పెట్టకపోతే చిత్తశుద్ధిలేని రాజకీయ నాయకుడుగా ఆయనకు చెడ్డపేరు రావడం మొదలైంది. దాంతో ఆయన అవిశ్వాసాన్ని పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. తాను అవిశ్వాసం పెట్టినా ప్రభుత్వం పడిపోకుండా ఉండాలని ఆయన భావించారు. ఓ వైపు నుంచి కాంగ్రెస్ పెద్దలతో ఆయన మాట్లాడుకుని అవిశ్వాసానికి తెరలేపారు. ఇప్పటికిపుడు మధ్యంతర ఎన్నికలు ఎదుర్కోవడానికి అధికార, ప్రతిపక్షాలు రెండూ సిద్ధంగా లేవు. అసెంబ్లీ రద్దయినా, ప్రభుత్వం పడిపోయినా వచ్చేవి మధ్యంతర ఎన్నికలే కనుక (కొన్నాళ్ల రాష్ట్రపతి పరిపాలన తరువాతనైనా) వాటిని ఎదుర్కోవడం అంత సులువైన పనికాదని కాంగ్రెస్ భావించింది. టీడీపీ కూడా అదే అభిప్రాయంతో ఉంది కనుక కొంతకాలం పాటు ప్రభుత్వం ఉంటేనే మేలన్న ధోరణితో అవిశ్వాసతీర్మానం తంతు నడిచింది.

## అసెంబ్లీ సాక్షిగా ప్రలోభాలు...

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారపక్షం తన సొంత ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టింది. అవిశ్వాసం ప్రతిపాదించాక ఓటింగ్‌కు రెండు రోజుల ముందు పీఆర్పీ కాంగ్రెస్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఒక డ్రామాకు తెరలేపింది. తమ ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారంటూ కాంగ్రెస్‌లో పీఆర్పీని విలీనం చేసిన నేత చిరంజీవి చేసిన వ్యాఖ్యలు కిరణ్‌కు దడ పుట్టించాయి. వాస్తవానికి చిరంజీవి నేతృత్వం లోని ఎమ్మెల్యేలకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని లేదు కానీ తాము అనుకున్న కోరికలు సాధించుకోవడానికి ఇదే సరైన సందర్భం అని భావించి ఓ ఝలక్ ఇచ్చారు. దీని వెనుక పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ హస్తం ఉందని ముఖ్యమంత్రికి ఉప్పందించి. దీంతో ఈ వ్యవహారం తీవ్ర రూపం దాల్చి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల నుంచి బొత్సకు అక్షింతలతో పాటు వారికి నచ్చచెప్పాలని ఆదేశాలందాయి. ఇదే సమయంలో దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడైన కె.వి.పి.రామచంద్రరావును కూడా రంగంలోకి దింపారు. కె.వి.పి. బొత్స, కిరణ్ అందరూ కలసి చిరంజీవినీ, ఆయన వెంట ఉన్న ఎమ్మెల్యేలను దారిలోకి తెచ్చుకోగలిగారు తప్పితే జగన్ వర్గం ఎమ్మెల్యేలను మాత్రం వారేమీ చేయలేక పోయారు. వై.ఎస్.ఆర్.పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నపుడు జగన్ వెంట ఉన్న ఎమ్మెల్యేలు 29 మంది ఆ బలం రెండు నెలల్లో క్రమంగా 18కి తగ్గింది. ఇందుకు అధికార పక్షం చేసిన కసరత్తే ప్రధానకారణం. డిసెంబరు 1 నుంచి ప్రారంభం అయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఎలాగూ అవిశ్వాసం ఎదుర్కోక తప్పదని భావిస్తూ వచ్చిన కిరణ్ ముందు నుంచే వారిని బుజ్జగించుకుంటూ వచ్చారు. దాంతో ఆ సంఖ్య క్రమంగా తగ్గింది. అయితే చివరి రోజున (అవిశ్వాసంపై ఓటింగ్ రోజున) వై.ఎస్.సతీమణి విజయమ్మ వెంట శాసనసభలోకి 18 మంది ఎమ్మెల్యేలు అడుగుపెట్టిన తరువాత కూడా కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు చేయని ప్రయత్నం లేదు, ఓ వైపు అవిశ్వాసంపై చర్చజరుగుతూ ఉండగా సభలోపలే జగన్ వర్గం ఎమ్మెల్యేలు ఒక్కొక్కరి పక్కన ఇద్దరు మంత్రులు కూర్చుని వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. అయితే చివరి రోజున ఎమ్మెల్యేలెవరూ చెక్కు చెదరలేదు. చివరి నిమిషంలో అయితే స్పీకర్ కనుక అనర్హత వేటు వేస్తే ఆరేళ్లపాటు ఎన్నికల్లోనే పోటీ చేయకూడదని అబద్ధపు ప్రచారం కూడా చేశారు. కానీ అధికారపక్షం ఒక్కరినీ లాక్కో లేకపోయింది. పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ రవి ఒక్కరే ఓటింగ్ సమయానికి లేకుండా జారుకున్నారు. దీని వల్ల అవిశ్వాసానికి ఒక ఓటు తగ్గింది. రవి ప్రవర్తన కూడా అవిశ్వాసం రోజున చాలా విచిత్రంగా కనిపించింది. ఆయన విజయమ్మతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోకి అడుగు పెట్టేటప్పుడు వైఎస్సార్ అమర్ హై అంటూ నినాదాలు చేసుకుంటూ వచ్చారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విజయమ్మ జగన్ వర్గం ఎమ్మెల్యేలతో కలిసి కాఫీ తాగడానికి అసెంబ్లీ క్యాంటీన్‌లోకి వచ్చినప్పుడు కూడా రవి ఆమెను వెన్నంటి ఉన్నారు. విజయమ్మ సభలో ప్రసంగించేటప్పుడు ఆమెకు నైతిక మద్దతు కోసం వెనకాలే కూర్చున్నారు. కానీ గంటలోపే ఏమైందో ఏమో సరిగ్గా అవిశ్వాసంపై ఓటింగ్ మరో అరగంటలో జరుగుతుందనగా ఎవరికీ అందకుండా అజా ఐపూ లేకుండా వెళ్ళిపోయారు. రవి అదృశ్యం వెనుక కిరణ్ సోదరుల హస్తం ఉందని గట్టి ప్రచారం జరిగింది. విప్‌ను ఉల్లంఘించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలొస్తే వాటిలో ఎలాగూ గెలవలేమన్న నగ్నసత్యం కాంగ్రెస్‌కు తెలుసు. ముఖ్యమంత్రికి కూడా దీనిపై స్పష్టమైన సమాచారం ఉంది. అందువల్ల తన సొంత జిల్లాలో (పూతపట్టు) ఉప ఎన్నిక వస్తే, అందులో ఓడిపోతే కాంగ్రెస్‌లో ఉన్న ప్రత్యర్థులకు (బొత్స వంటి వారికి) తనపై స్వారీ చేసే అవకాశం కలుగుతుందని ముఖ్యమంత్రి జంకారని తెలిసింది. బొత్స సొంత జిల్లా అయిన విజయనగరం నుంచి ఒక్కరు కూడా విప్‌ను ఉల్లంఘించలేదు కనుక ఆయన తన జిల్లా అంతా కాంగ్రెస్ వెంటే ఉందని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో చిత్తూరు జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే వెళ్లినా తనకు నామోషీగా ఉంటుందని కిరణ్ భయపడ్డారని చెబుతున్నారు. అందుకే అన్ని రకాలుగా ప్రయత్నించి రవిని ఓటింగ్‌కు రాకుండా చేయగలిగారని తెలిసింది. రవిని భారీగా ప్రలోభపెట్టారనేది విశ్వసనీయ సమాచారంగా ఉంది.

జగన్ వర్గానికి చెందిన 16 మంది ఎమ్మెల్యేలు విప్‌ను ధిక్కరించినా వారిపై అనర్హత వేటు వేసే సాహసం కాంగ్రెస్ చేయలేకుండా ఉంది. వీరిని బయటకు పంపితే ఉత్పన్నమయ్యే ఉప ఎన్నికలలో గెలుస్తామా లేదా అనే అనుమానంతో హైకమాండ్ పెద్దలున్నారు.


తాజా సమాచారం ప్రకారం అధిష్ఠానం వీరిపై చర్య తీసుకోకపోతే పార్టీ అభాసుపాలవుతుందని అధిష్ఠానం భావిస్తున్నారు. ఆ తరువాత విప్‌ను ధిక్కరించిన యం.యల్.ఎ.ల స్థానాలకు ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్ పార్టీకి మరో పెను సవాల్‌గా మారుతుంది. 16 కాంగ్రెస్, 1 పి.ఆర్.పి. స్థానాలతో పాటు ఇప్పటికే ఖాళీగా ఉన్న మరో ఏడు నియోజకవర్గాలు కలిపి మొత్తం 24 చోట్ల ఉప ఎన్నికలు వస్తే అవి మినీ జనరల్ ఎన్నికలను తలపించబోతున్నాయి.

తాను స్వయంగా ప్రాతినిధ్యం వహిస్తూ అందరికీ నీతులు వల్లే వేసే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ అవిశ్వాస తీర్మానంలో ఓటింగ్ ద్వారా తీసుకున్న నిర్ణయం మేధావి వర్గాల్లో సైతం విమర్శలకు దారితీసింది. అనునిత్యం ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోసే జయప్రకాష్ నారాయణ ఏమి ఆశించి ఓటింగ్‌లో పాల్గొనలేదనేది ప్రస్తుతం చర్చగా మారింది. ఆయన ఓటుతో నిర్ణయం తేలకపోయినా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అవకాశం వచ్చినప్పుడు వదిలేశారు. మొత్తం మీద చంద్రబాబు ప్రవేశపెట్టిన అవిశ్వాస ప్రహసనం (తీర్మానం) ఎవరి రంగు ఏమిటో ప్రజలకు మరోసారి బోధపడేలా చేసింది.

******

# ప్రేమ, కరుణ, క్షమామూర్తికి జన్మదిన కానుక

ఆధ్యాత్మికం



తను ఆచరిస్తూ కరుణ, క్షమ, ప్రేమ అను మహత్తర సుగుణాల నలవరచుకోమని ప్రజలందరికీ ప్రబోదించినట్టి మహోనీయుడు, రెండు వేల పదకొండు సంవత్సరాల క్రితం డిసెంబరు 25న జన్మించారు. ప్రపంచ వ్యాపితంగా నేటికీ దాదాపు నాలుగు వందల కోట్ల మంది అభిమానులు, భక్తులచేత అద్భుత ప్రవక్తగ, సాక్షాత్తూ దైవసుతునిగ ఆరాధింపబడుతున్న ఆ మహోనీయుడే మన ప్రియతమ యేసుక్రీస్తు. ఆయన మానవాళికి అంతగా ఆరాధనీయుడెలా అయ్యారని ఆశ్చర్యపడుతున్నారా?

ఆయన (యేసుక్రీస్తు) కు ముందు, మధ్యధరా సముద్ర ప్రాంతంలో, నాటి యూదు యాజకత్వం సమాజాన్ని సన్మార్గాన నడిపే బాధ్యతను విడనాడి, మితిమీరిన స్వార్థంతో మునిగి తేలుతున్నది. అందువలన సమాజంలో పరస్పర సహకారం నశించింది. అజ్ఞానం కష్టాలలో కూరుకుపోయిన వారికి, చేయూతనిచ్చి ఆదుకునే సహృదయులు కరువైపోయారు. దేవాలయ ప్రవేశాన్ని యూదేతరులకు నిషేధించారు. దేవాలయాలలోనే జంతువులు, జంతు బలులు, రక్తమాంసాలు నైవేద్యాలు, అట్టి మొరటు సాంప్రదాయాలతో దేవాలయ వాతావరణం కలుషితమైపోయింది. అత్యధిక జనులు ఆకలిదప్పులు, కష్టాలు, కన్నీళ్ళతో కుమిలిపోతున్నారు. గోరుచుట్టుపై రోకలిపోటన్నట్లు, చిన్నతప్పులకు సైతం కఠోరశిక్షలు విధిస్తూ అట్టి దీనుల పట్ల రాక్షసంగా ప్రవర్తిస్తున్నారు యూదుయాజకులు. పోనీ తమ దీనగాథల్ని దేవునికన్నా విన్నవించుకుందామంటే, దేవుడు ఉగ్రస్వరూపుడు, ఒకసారి తప్పు చేసిన మనిషికిక దేవుని వద్ద స్థానం లేదంటూ పాపం ఆ దీనులకు దేవుని ప్రార్థించుకునే అవకాశాన్ని గూడ లేకుండా చేసేశారు వాళ్ళు.

అట్టి స్థితిలో వేసవి తీవ్రతకు బీటలు వారిన నేల, తొలకరి వర్షం కోసం ఆబగా ఎదురుచూస్తున్నట్లు తమనాదుకునే రక్షకుని కోసం, ఆపద్బాంధువుని కోసం ఎదరు తెన్నులు చూస్తున్నారు ఆ దీనులు. అట్టి భీకర కష్టకాలంలో చీకటి గర్భాన్ని చీల్చుకుంటూ వచ్చి ప్రపంచానికి వెలుగును ప్రసాదించే బాలభాస్కరునిలా, జెరూసలేం లోని బెత్లెహాంలో ఉదయించాడు బాలయేసయ్య. నాటి నుండి నెలవంకలా ఎదుగుతూ, నాటికి మధ్యధరా ప్రాంతీయులు కనీ, వినీ ఎరుగనట్టి ప్రేమ, కరుణ, క్షమా గుణాల త్రివేణీ సంగమంగా వారి మధ్య సంచరిస్తూ అందరినీ ఆనంద, ఆశ్చర్యాలలో ముంచెత్తాడు యేసుక్రీస్తు. అందుకే నాటికీ, నేటికీ ఆయనను దైవాంశ సంభూతునిగా, దైవసుతునిగ విశ్వసిస్తున్నారు జగతి జనులు. యేసుక్రీస్తుకు, దేవునకు గల సంబంధాన్ని నదీ, సాగర సంబంధంతో పోల్చుతున్నారు విజ్ఞులు. అదెలాగో చూద్దాం మరి.

అంతులేని సముద్రం, దేవుడు, ఆ సముద్రుని అంశయైన నీటి ఆవిరి, పరిశుద్ధాత్మ!

ఆ నీటి ఆవిరి తో ఏర్పడిన మబ్బు – పవిత్రకన్య మరియు (పరిశుద్ధాత్మతో) దాల్చిన గర్భము!

ఆ మబ్బు వర్షించేందుకు సహకరించిన చల్లనిగాలి – మరియభర్త యోసేపు!

ఆ మబ్బు కురిసిన వర్షము – మరియ ప్రసవించిన యేసుక్రీస్తు!

ఆ వర్షము సెలయేరుగ, మహానదిగ

ఎదిగినట్లు – మంచివక్తగ, మహాప్రవక్తగా ఎదిగాడు ఏసుక్రీస్తు.

ఆ మహానది దేశదేశాలలో ప్రవహించి ప్రజలందరికీ సాగునీరు, త్రాగునీరు అందించింది.

ఆ మహాప్రవక్త యేసుక్రీస్తు అంతటా పర్యటించి మానవాళికి ప్రేమ, కరుణ, క్షమ సుగుణాల నలవరిచాడు.

తన పనిని పూర్తిగావించి నది తిరిగి తన జన్మస్థలమైన సముద్రం చెంతకెళ్ళి, అందులో కలిసిపోయింది.

తన తండ్రి చిత్తాన్ని నెరవేర్చిన యేసుక్రీస్తు తిరిగి తన తండ్రి దేవుని చెంతకెళ్ళి, ఆయనలో లీనమయ్యాడు.

ఆ నదీ, సాగర సంబంధంలా, యేసుక్రీస్తు, దేవుని సంబంధం గూడ విడదీయరాని బంధం. అందుకే యేసుక్రీస్తును, దేవుని వేరు వేరుగ చూడటం లేదు ప్రజలు.

అలా అవనిపై అవతరించిన యేసుక్రీస్తు ప్రజల కష్టాలు, కన్నీళ్ళకు చలించిపోయాడు ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లేందుకు ప్రేమ సామ్రాజ్య స్థాపన అవసరమని, తన తండ్రి (దేవుని) చిత్తమూ అదేనని గుర్తించాడు యేసుక్రీస్తు. అట్టి మహోన్నత ప్రేమసామ్రాజ్య నిర్మాణం కొరకు మానవాళి తప్పక నిర్వహించాల్సిన కర్తవ్యాలను, తాను ఆచరించి చూపుతూ ప్రబోధించాడు జీసస్. పండితులకు, పామరులకు, ఆబాల గోపాలానికి, అరటి పండొలిచి అరచేత పెట్టినట్లు, చిట్టి, పొట్టి కథలతో అద్భుతంగా ప్రబోధించాడు యేసుక్రీస్తు. ఆయన ప్రబోధాల సారమంతా "మూడు బంగారు సూత్రాల" రూపంలో విశ్వవ్యాపితమయ్యాయి. విఖ్యాతి గాంచాయి. అవి–

**(1) 'నీవు నీ నిండు హృదయంతో, నీ పూర్ణ ఆత్మతో, నీ శక్తి యంతటితో దేవుని ప్రేమించు'**

ఈ సూత్రంలోని బంగారం లాంటి భావమేమంటే – "హృదయ పూర్వకంగా తన తండ్రిని ప్రేమించినంత గాఢంగా దేవుని ప్రేమించగలిగిన మనిషి, దేవుడు సృష్టించిన సమస్త మానవులనూ తన సహోదరులుగ భావించగలడు. అప్పుడు కష్టాలలో ఉన్నవారందరికీ తన సోదరులకిచ్చినట్లే చేయూత నివ్వగలడు. అంతేగాదు తండ్రి ఆంతర్యాన్ని గ్రహించినంత సులువుగా, దేవుని ఆంతర్యాన్ని, ఆశయాన్ని, ఆయన అందించే సంకేతాలను గ్రహించి తదనుగుణంగా నడుచుకోగల్గుతాడు మనిషి. మరి మానవులంతా అలా నడిచిన రోజున అదిక ప్రేమసామ్రాజ్యమే. యేసు క్రీస్తు ప్రబోధిస్తున్న దేవుని రాజ్యం అదే అదే అదే.

**(2) "నిన్ను నీవలె, నీ పొరుగు వారిని ప్రేమించు"**

ఈ సూత్రంలోని బంగారు భావం : "తనను ప్రేమించుకున్నంత గాఢంగా, తన ఇరుగుపొరుగు వారినీ ప్రేమించగలిగిన మనిషి, తనకు కలిగిన బాధలు, దుఃఖాలు, ప్రమాదాల నుండి తనను కాపాడుకునేందుకు ప్రయత్నించినంత ధృడంగా పరులను గూడ కష్టాల నుండి కాపాడేందుకు ప్రయత్నిస్తాడు. ప్రతి ఒక్కరూ అలా ఈ బంగారు సూత్రాన్ని పాటించినప్పుడు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ కోట్లాది సోదరుల అండదండలు లభిస్తాయి. అప్పుడిక ప్రపంచంలో అనాధలే ఉండరు. జీసస్ చెప్పిన ప్రేమసామ్రాజ్యమంటే అదే మరి.

**(3) "సాటి మానవులు నీకు ఏమి చేయాలని కోరుకుంటున్నావో, నీవునూ వారికి అదే చెయ్"**

ఈ సూత్రం లోని బంగారు భావమేమంటే – "ప్రతి మనిషీ తను కష్టాలలో కూరుకుపోయి, వాటి నుండి తనను తాను కాపాడుకోలేని అసహాయ స్థితిలో ఉన్నప్పుడు, తన ఇరుగుపొరుగు వారొచ్చి ఆ బాధల నుండి తనను కాపాడి, తన ఆకలిదప్పులు తీర్చితే బాగుండునని ఆశిస్తాడు. అదేవిధంగా బాధల్లో ఉన్న తన పొరుగువారు గూడ, తన నుండి అదే ఆశిస్తారన్న స్పృహను కలిగి వున్న మనిషి కష్టాలలో ఉన్న సాటి మానవులను కాపాడేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తాడు. అలా సాటి మానవులకోసం ప్రతి ఒక్కరూ స్పందించగలిగిన సమాజమే గదా ప్రేమసామ్రాజ్యం!


సోదరీ సోదరులారా మహాప్రవక్త యేసుక్రీస్తు ప్రబోధించిన యీ మూడు బంగారు సూత్రాలను పాటిస్తూ, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన ప్రేమ, కరుణ, క్షమామార్గమున పయనించిన రోజున ఈ ప్రపంచమంతా ఒకే కుటుంబం. అందరి ప్రజలందరూ సహోదరులు. ఓహ్.. మహా ప్రవక్త యేసుక్రీస్తు ప్రబోధించిన దేవుని రాజ్యం, మహోన్నత ప్రేమసామ్రాజ్యం అదే! అదే! అదే!

అట్టి అత్యున్నత ప్రేమ సామ్రాజ్య స్థాపనకై, కర్కశమైన శిలువను గూడ భరించి తన రక్తమంతా ధారబోసినట్టి, తన నంతగా హింసించిన ఆ ఘోర పాపాత్ములను సైతం "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు. కనుక వీరిని క్షమించు'' మని దేవుని వేడుకున్నట్టి ఆ మహోన్నత 'ప్రేమ, కరుణ, క్షమామూర్తి' యొక్క జయంతి దినోత్సవం నాడు, కృతజ్ఞత, ప్రేమ, భక్తి పూర్వకంగా మనం ప్రతి ఒక్కరమూ ప్రతిజ్ఞ చేద్దామిలా.

**"హే ప్రభో, యేసుక్రీస్తూ, నీవు చెప్పిన**
**ఈ మూడు బంగారు సూత్రాలను విధిగా**
**పాటిస్తూ నీవు చూపిన ప్రేమ, కరుణ,**
**క్షమా మార్గాన నిరంతరం పయనిస్తూ,**
**ప్రజలందరూ సుఖశాంతులతో**
**వర్ధిల్లే, నీ ఆశయము, దేవుని చిత్తమూ,**
**ఐనట్టి మహోన్నత ప్రేమసామ్రాజ్య**
**(దేవుని రాజ్య) నిర్మాణం కోసం, నేను**
**మనసా, వాచా, కర్మణా**
**పరిశ్రమిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. అందుకు**
**నీ సహాయ సహకారాలను, ఆశీస్సులను**
**అర్థిస్తున్నాను. ప్రియాతి ప్రియమైన**
**యేసు ప్రభువా, వాటిని నాకు**
**సమృద్ధిగా ప్రసాదించెదవు గాక! ఆమెన్!**

సోదరీ సోదరులారా! మహాప్రవక్త! మహోన్నత ప్రేమసామ్రాజ్యాధినేత, యేసుక్రీస్తుకు మనం సమర్పించుకోదగిన మిక్కిలి విలువైన జన్మదినకానుక. ఆ ప్రేమమూర్తి మన నుండి ఆశిస్తున్న అసలు, సిసలు కానుక. అమూల్యమైన కానుక. ఈ ప్రతిజ్ఞయే. ఈ వాస్తవాన్ని ప్రజలందరూ గుర్తించెదరు గాక. తథాస్తు!

మీ సోదరుడు




**– పాతూరి వెంకటేశ్వరరావు**
సెల్ : 9849081889

# మహానటి సావిత్రి



సావిత్రి వర్ధంతి సందర్భముగా ప్రత్యేక వ్యాసం

- సందిరెడ్డి కొండలరావు

***మనకున్న ఎన్నదగిన అతికొద్దిమంది మంచి నటీమణుల్లో స్వర్గీయ సావిత్రి ఆణిముత్యం. నటిగా ఆవిడ అత్యున్నతమైన నటన, హావభావ ప్రదర్శనలో తనదైన శైలి, డైలాగ్ డెలివరీలో తన ముద్ర అవతలి నటి లేదా నటుడి నటనకు ప్రతిస్పందన ఇలా నటనకు సంబంధించి ఆమె ఒక గ్రంధాలయం అంటే అతిశయోక్తి కాదు. సావిత్రి పర్సనాలిటీ విషయానికొస్తే కొంచెం బొద్దుగా ఉండేది. ఇప్పటి నటీమణుల్లా స్లిమ్‌గా ఉండేదికాదు. కానీ ఆమె నటన చూసిన వారికెవరికీ ఈ విషయం గుర్తుకు రానంత బాగా నటించి ప్రేక్షకులను మెప్పించింది.***

కీర్తిశేషులు శ్రీ గురజాడ అప్పారావు గారి నాటకం "కన్యాశుల్కం" చలన చిత్రంగా నిర్మించినపుడు ఆ చిత్రంలో మధురవాణిగా ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకుంది. అది ఒక వేశ్య పాత్ర. అప్పట్లో సీనియర్ నటులు కీర్తిశేషులు శ్రీ సి.యస్.ఆర్., యన్.టి.ఆర్., షావుకారుజానకి వంటి వారి ప్రక్కన నటించి, అదీ ఓ వేశ్యపాత్రలో నటించి శభాష్ అనిపించుకోవటం మామూలు విషయం కాదు. విజయావారి "మాయాబజార్" చిత్రంలో శశిరేఖగా ఆమె నటన నట మత్తగజాలనదగ్గ యస్.వి.ఆర్., యన్.టి.ఆర్., ఏ.యన్.ఆర్., గుమ్మడి, సి.యస్.ఆర్., ముక్కామల, రేలంగి, రమణారెడ్డి, ఋష్యేంద్రమణి, సూర్యాకాంతం, ఛాయాదేవి వంటి వారిని అధిగమించి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ చిత్రంలోని శశిరేఖ మామూలు శశిరేఖ కాదు. అణుకువ, వినయం, సంస్కారం, సిగ్గు, పెద్దల యెడ గౌరవం కలిగిన శశిరేఖగా మళ్ళీ పెంకెతనం, కొంటెతతనం, పొగరుమోతుగా కనిపించే శశిరేఖగా రెండు రకాలుగా కనిపించే పాత్ర. ఆ పాత్రను దర్శకులు కె.వి.రెడ్డి గారు మలచినతీరు అలాంటిది. అలాంటి రెండు పరస్పర విరుద్ధ స్వభావాలను ఒకే పాత్రలో చూపించడం ఏ నటికైనా ఓ పరీక్ష. ఆ పరీక్షలో సావిత్రి ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు.

తన బాబాయ్ కృష్ణుడి దగ్గర బావను చేసుకోలేకపోతున్నానే అని బాధపడే శశిరేఖలో కనపడే ముగ్ధత్వం, సౌకుమార్యం, అమాయకత్వం, దీనత్వం చూసిన వారి మనసు పిండినట్లవుతుంది. అదే శశిరేఖ స్థానంలోకి ఘటోత్కచుడు ప్రవేశించినపుడు మాయాశశిరేఖ లోని ఆ ఠీవి, ఆ దర్పం, ఆ నిర్లక్ష్యం, పొగరుమోతుతనం, కొంటెతనం, ఆ పెంకెతనం, మహానటి సావిత్రి చూపించిన వైనం చూపిన ప్రతి ప్రేక్షకుల మనసులో పదికాలాలు నిలిచే ఉంటాయి.

రంగారావు, సావిత్రి ఈ చిత్రంలో పోటీపడి నటించారు. ముఖ్యంగా వారి మధ్య నటన పరంగా ఉన్న అవగాహన మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. శకునితో సరదాగా పాచికలాడే సీన్లో కూడా ఆమె శకుని సి.యస్.ఆర్.ని. ఖంగు తినిపించింది. ఆ చిత్రం చూసిన వారెవరు మరువలేని పాట "అహ నా పెళ్ళి అంట, ఓహో నా పెళ్ళి అంట". ఆ పాటలో లక్ష్మణ కుమారుణ్ణి మాయా శశిరేఖ ఏడిపిస్తూ పాడుతుంది. రేలంగి వెంకటరామయ్య గారు, సావిత్రి కలసి ఆ పాటలో ఆంధ్ర ప్రేక్షకులకు అద్భుతమైన నటన అందించారు. ఎంతో సున్నితమైన హాస్యం సకుటుంబ సమేతంగా చూడతగిన రీతిలో మనసుని గిలిగింతలు పెట్టింది ఆ చిత్రంలో ఏ.యస్.ఆర్.ని. మాయా శశిరేఖ టీజ్ చేసే సీన్లో కూడా ఆవిడ నటన మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఆ సీన్లో ఆయన్ని ఆవిడ దాదాపు డామినేట్ చేసిందనే చెప్పాలి. ఇక లక్ష్మణ కొడుకును భయపెట్టడం, దీనికి లక్ష్మణ కుమారుడి ప్రతిస్పందన ప్రేక్షకుల్ని ఆనందడోలికల్లో ముంచెత్తుతుంది. "దీపావళి" చిత్రంలో సత్యభామగా ఆమె నటన తనదైన శైలి ఆ పాత్రలో చూపించింది.

ఇక సాంఘిక చిత్రాల విషయానికొస్తే సావిత్రి చెయ్యని పాత్ర లేదంటే అతిశయోక్తి కాదు. "మిస్సమ్మ" చిత్రంలో ఆమెదే టైటిల్ రోల్. ఈ చిత్రంలో ఆమె హేమా హేమీలతో పోటీపడ్డారు. ఈ చిత్రంలో ఆమె తన నటనలో



చాలా అద్భుతాలు చూపించారు. మొదట ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్ళగా అక్కడ గుమ్మడి రామారావుగారితో మంచినీళ్ళు తాగిస్తే, సావిత్రి ఇచ్చిన షాక్ దెబ్బకు తానే ఓ గ్లాసు మంచినీళ్లు తాగుతాడు. ఈ సీన్లో ఆమె చక్కని నటన ప్రదర్శించారు. యన్.టి.ఆర్. పార్కులో ఆమెతో పెళ్ళికాకపోయినా ఐనట్లు నటిస్తే, అందుకు ఆమె సహకరిస్తే ఇద్దరికీ ఉద్యోగం వస్తుందన్నప్పుడు ఆమె ముందు అతన్ని తిట్టి ఆ తర్వాత ఆలోచించి అతని ప్రపోజల్‌కు అంగీకరించిన సీన్లో ఆమె నటన మనల్ని ఆకట్టుకుంటుంది. ఆమె మనసుకు విరుద్ధంగా ఆమెకు హిందూ సాంప్రదాయాలను అన్వయిస్తుంటే ఆమె చూపిన చిరాకు ప్రేక్షకులకు ముచ్చటేస్తుంది. ఆమె వైద్యం చేయటానికొచ్చిన అల్లు రామలింగయ్యను ఆమె దెయ్యం పట్టినట్లు బెదిరించి భయపెట్టె సీను ఆ చిత్రం చూసిన ప్రేక్షకులెవరూ మరిచిపోలేరు. అసలు ఆ చిత్రంలో అందరూ ఒకరిని మించి మరొకరు పోటీపడి నటించారు. కామెడీ చిత్రాల్లో రారాజు అనతగ్గ చిత్రం "మిస్సమ్మ" ఈ చిత్రాన్ని విజయావారు ఎల్.వి. ప్రసాద్‌గారి దర్శకత్వంలో నిర్మించి అఖిలాంధ్ర ప్రేక్షకులకు ఓ చక్కని కళా ఖండాన్ని సున్నితమైన, సునిశితమైన హృదయాన్ని గిలిగింతలు పెట్టే హాస్యాన్ని అందించారు.

సావిత్రి నటించిన మరోచక్కని చిత్రం "గుండమ్మ కథ" ఇందులో ఆమె సవతితల్లి నీడలో పెరిగే ఓ ఒద్దికైన, అణుకువ, వినయం, అభిమానం కలిగిన ఆడపిల్లలా నటించారు. ఉన్నంతలోనే సర్దుకొనే ఆమె మనస్తత్వం ఆవిష్కరించిన తీరు మనల్ని ముచ్చటపడేలా చేస్తుంది. ఆ చిత్రంలో "కోలు కోలోయన్న కోలో నాయన్న కొమ్మలిద్దరు మాంచిజోడూ" అనే పాటలో 'ఊ' అనే చిన్న హమ్మింగ్‌కు ఆమె పెదవులతో, కళ్ళతో అభినయించిన పద్ధతి మన మనసుల్ని రంజింపచేస్తుంది. "లేచింది నిద్ర లేచింది మహిళాలోకం" అనే పాటలో సైతం ఆమె నటన మనల్ని ఆకట్టుకుంటుంది. అసలా పాటను చిత్రంలో యన్.టి.ఆర్. పాడతారు. ఐనా ఆమె తన ఉనికిని కాపాడుకున్నారు. అదే చిత్రంలోని "అలిగినవేళనే చూడాలీ గోకుల కృష్ణుని అందాలూ" అనే పాటలో కూడా ఆమె చాలా మనోహరంగా నటించారు. తన పెద్దమ్మను కాపాడేందుకు ఛాయాదేవితో చెప్పే" ఇవి పిడకలు కొట్టిన చేతులే'' అంటే ఇవి జొన్నలు దంచిన చేతులే'' వంటి డైలాగులు ఆ రోజుల్లో బహుళ ప్రజాదరణ పొందాయి.

''విచిత్ర కుటుంబం" చిత్రంలో ఓ అమాయకురాలైన ఇల్లాలిగా, వదినగా ఆమె నటన ముగ్ధమనోహరంగా ఉంటుంది. ఈ చిత్రంలో ఆమె భర్తగా నటరత్న, మరిదిగా నటశేఖర కృష్ణ నటించారు. దాసరి

## <u>మహానటి ఎలా అయ్యింది?</u>

**అందానికి అందం నీవే పుత్తడి బొమ్మా అని సినీకవి చెప్పిన అక్షరవర్ణన మహానటి సావిత్రికి సరిగ్గా అమరుతుంది. ఆమె నటనకే ఒక గీటురాయి. నిబద్ధతకు స్పష్టమైన అర్థం. సావిత్రి నటించిన సినిమాల్లో ఏ సినిమా బావుంది' అని ఎవరినైనా అడిగితే 'అన్నీ బావున్నాయి' అనే చెబుతారు అంతగా ఆమెకు పేరు రావడానికి ఎంతగా కష్టపడిందో, కృషి చేసిందో తెలుసుకుంటే ఆశ్చర్యం వేయకమానదు. ఒక సీను చేయాలంటే ముందుగా రిహార్సల్స్ చేసేది. తన పాత్రకు సంబంధించిన డైలాగులను అద్దం ముందు అటూ, ఇటూ నడుస్తూ బైహార్ట్ చేసేది. అలాగే తన సహచర నటుల సలహాలను తీసుకునేది. పూర్తిగా తనకు సంతృప్తి కలిగాకనే ఆమె సెట్‌మీదకు వచ్చేది. అలాగే ఏడుపు సీన్లలో నటించేటప్పుడు గ్లిజరిన్ లేకుండా ఆటోమెటిక్‌గా కన్నీళ్లు కార్చటం ఆమె ప్రత్యేకత. సరిగ్గా కళ్లనుండి ఎన్ని డ్రాప్‌లు రావాలో అన్నే డ్రాపులు వచ్చేవట. కన్నీరు మీద కూడా ఆమెకు అంత కంట్రోలు ఉండేది మరి. అంతటి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉండేది కాబట్టే సావిత్రి నటించిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయాయి. అందుకే ఆమె మహానటి అయ్యింది.**

దర్శకత్వంలో ఆమె నటించిన "గోరింటాకు"లో ఆమె నటించిన ''గోరింట పూచింది కొమ్మాలేకుండా మురిపాల అరచేత మొగ్గా తొడిగింది'' అనేపాట ఎవ్వరమైనా ఎలా మరచిపోగలం...? అప్పటికే ఆమె తమిళ నటుడు జెమిని గణేషన్‌తో వైవాహిక జీవితం లోని అ సంతృప్తి వల్ల తాగు డుకు బానిసై పోయింది. ఐనా ఆ పాటలో ఆమె జీవిం చింది. ఆమె ఒక్క నటిగానే గాక దర్శకు రాలిగా కూడా తన ప్రతిభ నిరూపించుకున్నారు. "మాతృ దేవత" ఆమె దర్శకత్వ ప్రతిభకు నిలువెత్తు తార్కాణం.

భానుమతి, అంజలీ దేవి, షావుకారు జానకి, కృష్ణ కుమారి, బి. సరోజదేవి, వంటి నటీ మణులకు తన దీటైన నటనతో ఎదుర్కొని ఆంధ్ర చలన చిత్ర పరి శ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని, గుర్తింపునీ, ముద్రనీ చాటుకుంది మహానటి సావిత్రి. ఆమె నట మత్త గజాలన తగ్గ యన్.టి.ఆర్.ఏ.ఎన్.ఆర్., యస్.వి.ఆర్., సి.యస్.ఆర్., రేలంగి వంటి వారితో పోటీపడి నటించి వారితో శభాష్ అనిపిం చుకున్న మేటి నటీ మణి. అలాంటి మహా నటిని మన ప్రభు త్వాలు గుర్తించక పోయినా, ప్రేక్షకులు, సాటి నటీ, నటులు ఆమె ప్రతిభను గుర్తించి గౌరవించారు. మహానటి సావిత్రిని గౌరవించటం అంటే కళాభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ తమని తాము గౌరవించుకున్నట్లే. నవరసాలనూ నవరత్నాలుగా మలచి తన నటనతో ప్రేక్షక హృదయాల్లో నిలిచిపోయిన మహానటి సావిత్రి



నీలం సంజీవరెడ్డితో, శాంతకుమారి, సూర్యకాంతం, రమాప్రభ, జమునలతో సావిత్రి, ఎన్.టి.ఆర్.



## అక్కయ్యని మర్చిపోలేను!

పరిశ్రమలో సీనియర్స్ నాకు చాలా ఇష్టమైన వ్యక్తి సావిత్రి. ఆవిణ్ని నేను అక్కా అని పిలిచేవాడిని. 'వింతకాపురం' సినిమాకి పని చేసేటప్పుడు సావిత్రి గారిని తొలిసారి చూశాను. రాజబాబు నన్ను ఆవిడకు పరియం చేశారు. తర్వాత రోజుకు ఒక్కసారైనా ఆవిడను కలిసి మాట్లాడేవాడిని. ఒక్కోసారి నేను వెళ్ళకపోతే ఆవిడే ఫోన్ చేసి 'తమ్ముడూ ఒకసారి వచ్చివెళ్లు' అనేది. అక్కయ్య నాకు పరిచమయ్యేనాటికే చాలా కష్టాల్లో ఉ ంది. బంధువులు ఆవిడను ఎలా ఎక్స్‌ప్లాయిం చేసే వారో నా కళ్లతో నేను చాలా సార్లు చూశాను. తమ్ముడూ అని నన్ను ఆప్యాయంగా పిలుస్తూ తన కష్టాలను నాతో చెప్పుకొనేది. నావి దాదాపు పదిహేను సినిమాల్లో అక్కయ్యతో ఏదో ఒక క్యారెక్టర్ చేయించాను. ఆఖరు రోజుల్లో నేను చేయగలిగినంత ఆర్థికసాయం చేశాను. నిర్మాత మురారి కూడా ఆర్థికంగా చాలా సాయం చేసేవారు సావిత్రిగారికి. ఆ రోజు మే3, అర్ధరాత్రి పన్నెండు దాటింది. 'సుజాత' సినిమా షూటింగ్ ఆఖరు రోజు.. మే నాలుగు నా పుట్టినరోజు. యూనిట్‌వాళ్లు కావాలనే అలా ప్లాన్ చేశారు. పన్నెండు దాటగానే కేక్ తెప్పించి నాతో కట్ చేయించారు. అక్కడే ఉన్న అక్కయ్య 'మీరందరూ దొంగలు, నాకు చెప్పరా తమ్ముడి పుట్టినరోజని' అంటూ తన మెళ్లో ఉన్న బంగారు చైన్ తీసి నా మెళ్ళో వేసేసింది. అదే ఆఖరుసారి అక్కయ్యను ప్రాణాలతో చూడం. తర్వాత ఆవిడ బెంగుళూరు వెళ్లింది. అక్కడే కాలుజారి కిందపడిపోయి, కోమాలోకి ...వె..ళ్ళి...పోయింది. అక్కయ్య మీద అభిమానం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ చెక్కుచెదరనీది. ఆవిడ నా మీద చూపించిన అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేను.

– దాసరి నారాయణరావు



తిరుపతిలో వివాహమయిన వెంటనే

నిజంగా అమరజీవి. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆశిస్తూ...

సావిత్రి మంచి మనసు

మహానటి సావిత్రికి ఎంతటి పేరుండేదో తన డబ్బు నగలంటే అంతటి



1961 డిసెంబరు 6వ తేదీన గుండమ్మ కథ చిత్ర షూటింగ్‌లో సావిత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఎన్.టి.ఆర్.

నిర్లక్ష్యమూ ఉండేది. ఆమె మహావైభవంగా విలసిల్లిన రోజుల్లో ఇంటికొచ్చిన ప్రతివాళ్లకూ తన దగ్గరున్న నగల్ని చూపిస్తుండేది. అలా వచ్చే వాళ్లలో ఆమె దూరపు చుట్టాలు, స్నేహితులు కూడా ఉండేవారు. ఓ రోజు కొందరు స్నేహితులు ఇంటి కొస్తే వాళ్ళ ఎప్పటిలాగే తన నగలు చూపించింది. ఆ సమయంలో ఏదో పనుండి లోపలికెళ్ళింది. తిరిగొచ్చి చూసుకునేసరికి చెవి రింగులు కనిపించలేదు. అయితే అవి పోయాయని ఆమె బాధపడలేదు. కొన్ని రోజుల తర్వాత ఎప్పుడో ఆమెకు సన్నిహితురాలు ఏదో మాటల సందర్భంలో వాటి గురించి అడిగింది. “ఆ! పోనిద్దూ, ఆ కొట్టినవాళ్ళకు అవి నచ్చాయేమో! తీసు కెళ్ళుంటారు’, అవి పోతే మళ్ళీ కొనుక్కోగలను కానీ వాళ్లు కొనుక్కోలేరు కదా? ఇవి కావాలి అని అడిగేందుకు బహుశ వాళ్ళు సిగ్గుపడుంటారు” అని సావిత్రి చెప్పడం చూస్తే ఆమె మనసు ఎంత గొప్పదో తెలుస్తుంది. ‘పాపం వాళ్ళ తప్పేంలేదు అడగలేక చెప్పకుండా తీసుకెళ్ళుంటారు. అయినా నేను చనిపోయేటప్పుడు ఇవేవీ తీసుకెళ్ళను కదా! వాళ్లైనా సరదాగా ఉండనీ’ అని చాలా తేలిగ్గా చెప్పిందట.

ఈ ఒక్క సంఘటనే కాదు. అడిగినవారికి, అవసరమున్న వారికి, స్నేహితులకు లేదనకుండా, కాదనకుండా దానధర్మాలు చేసింది. అలా ఇచ్చిన డబ్బు



కలత్తూర్ కన్నమ్మ చిత్రంలో కమలహాసన్‌తో సావిత్రి

లక్షల్లోనే ఉంటుంది. కానీ తిరిగిమ్మని వారినెన్నెడూ అడగలేదు. అంతటి ఐశ్వర్యవంతురాలు చివరి రోజుల్లో చేతిలో పైసా లేకుండా ఎంతో పేదరికాన్ని అనుభవించింది. ఆమె సాయం పొందినవాళ్ళు కూడ ఆమె వంక కన్నెత్తి చూడలేదు.

తెలుగు చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిపోయే పేరు ‘సావిత్రి’.. మామూలు ‘సావిత్రి’ కాదు ‘మహానటి’ సావిత్రి. ఆమె జీవితం కాల్పనిక నవలకన్నా ఎక్కువమలుపులతో సాగింది. ఎక్కడో


## నవసావిత్రి

– తనికెళ్ళ భరణి

త్రికాలానికి అతీతమైన  
త్రివిక్రమ స్వరూపం  
నటరాజుకు స్త్రీరూపం  
సావిత్రీ...  
సావిత్రి కొంగు  
నిర్మాతలకు బంగారం  
ఆవిడ కన్యాశుల్కంలో నవ్వితే  
మధురవాణి డంగైపోయింది.  
మాయాబజార్‌లో  
ఘటోత్కచుణ్ణి అనుకరిస్తే  
యస్.వి. రంగారావే కంగారుపడ్డాడు  
ఆమె నాయికైతే  
ప్రేక్షకుడే నాయకుడు  
ఆమె చెల్లి అయితే  
ప్రేక్షకుడే అన్న  
ఆమె పార్వతి అయితే  
ప్రేక్షకులంతా దేవదాసులే  
కోమాలో ఆమెను చూస్తే  
పాడుబడ్డ బావిలో  
తేలే చందమామలాగా  
పతనమైన విజయనగర  
సామ్రాజ్య వైభవంలాగా  
ఓడరేవులో లైట్లారిపోయిన  
ఒంటరి దీపస్థంబంలాగా ఉండేది  
‘నభూతో న భవిష్యత్’  
ఒక్క సావిత్రికే ఈ వాక్యం వాడొచ్చు.



1971 కన్నతల్లి చిత్రం వర్కింగ్ స్టిల్



మహానటి సావిత్రి నటించిన మొదటి సినిమా నుంచీ ఆమెని తొలిగించిన సంగతీ, ఆ తరువాత చాలా కాలం ఆమెకి అవకాశాలు రాలేదన్న సంగతీ చాలామందికి గుర్తుండే ఉంటుంది. సావిత్రి కెరీర్ మొదటి రోజుల్లో ఆమెకి డైలాగ్ మోడ్యులేషన్‌లో అక్కినేని గారు సలహా ఇచ్చేవారు. అక్కినేని కంటే సావిత్రి 12 సంవత్సరాలు చిన్న. ఐనా సావిత్రితో వేషం అంటే ఆయనకి సవాలుగా ఉండేది. సంభాషణోచ్చారణలో గురువైన అక్కినేనికే 'సుమంగళి' సినిమాలో ఒక చోట సావిత్రిగారు సలహాలిచ్చేవారట. అవి విన్న అక్కినేని గారు సావిత్రిలో వచ్చిన పరిణితికి ఆశ్చర్యపోతూ ఆమె సలహాలని సహృదయంతో స్వీకరించారట. అప్పటి నుంచీ సావిత్రే అక్కినేనికి గురువుగా ఉండేవారట. 'మూగమనసులు' సినిమా నిర్మాణం ఊహాత్మకంగా నైనా లేక పూర్వమే, ఆత్రేయ గారు ఒకసారి సావిత్రితో 'గోపీ' అన్న పిలుపును ఎన్ని రకాలుగా చెప్పగలవో ప్రయత్నించు' అన్నారట. దాదాపు 30 విభిన్న శైలుల్లో 'గోపీ' అనే పిలుపును వినిపించారట సావిత్రి. దటీజ్ సావిత్రి.

గుంటూరు జిల్లాలోని మారుమూల పల్లెటూర్లో పుట్టి, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి బెజవాడ పెదనాన్న ఇంట చేరి.. అలా మద్రాసు చేరి నింగికెగిసిన తార నేల కొరుగుతుందని ఎవరూ కలలోనైనా ఊహించలేదు. కార్లు, బంగళాలు మందీ మార్బలంతో ఊహించని వైభవాల వెలుగులో సాగిన జీవితం గవర్నమెంటు హాస్పిటల్లో కటికనేటమీద పడుకునే దుస్థితి రావడం.. పగవారికి సైతం వద్దనుకునే అధోగతి! 596 రోజులు కోమాలో ఉండి 1981 డిశంబర్‌లో కన్నుమూశారు.

******



మరణించిన సమయంలో సావిత్రి

# జీఓఎం సభ్యుల్ని పరిచయం చేసిన చిదంబరం




## గుండ్లకమ్మ మాస పత్రికకు
## చందా దారులుగా
## చేరాలనుకుంటున్నారా!

రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సర్కులేషన్ కలిగి మల్టీ కలర్‌తో గ్రామీణ ప్రాంతమునుండి వెలువడుతూ, పాఠకుల విశేష ఆదరాభిమానాలు పొందుతున్న "గుండ్లకమ్మ" మాస పత్రికకు చందాదారులుగా చేరండి

ప్రతి నెల మీ ఇంటికి పోస్టు ద్వారా తెప్పించుకోండి.

**రెండు సంవత్సరముల చందా రూ.200/- లను**

**"అఖిల్ పబ్లికేషన్స్" పేరుతో డి.డి. లేదా యం.ఓ.ను**

మీ పూర్తి అడ్రస్సుతో ఈ క్రింది చిరునామాకు పంపగలరు...

**అఖిల్ పబ్లికేషన్స్, కాకాని పాలెం, అద్దంకి. ప్రకాశం జిల్లా. ఫోన్: 98485 59566**

---

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో

**"గుండ్లకమ్మ"**

**www.gundlakamma.com**

వాస్తు

# వాస్తు పూజ



**గంటా సాయిబాబా,** వాస్తు పరిశోధకులు, సిద్ధాంతి.
సెల్ : 9848340130

**వా**స్తు పురుషుడు గృహము యొక్క అధిపతి. భూదేవత, మనకు ఆయుః ఆరోగ్యములు సంపదలు – వంశవృద్ధి కలుగచేయునది.

అందువలన గృహరంభము. గృహ ప్రవేశములందు స్థంభములు, ద్వారబందములు ఎత్తునప్పుడు వాస్తు పసుపు కుంకుమలతో (వాస్తు పురాణ పూజ) తప్పక జరిపించవలయును. గృహము యొక్క యజమాని ఈ క్రింది విధముగా మనస్సులో తలచుకొని ఈ క్రింది శ్లోకమును పఠించవలయును.

**వాస్తు పూజా మంత్రము :**

వాస్తు దేవో నమస్థుభ్యం !
భూశయ్యో నిరతప్రభో !!
మద్భు హే ధనధాన్యాది !!
సంవృద్ధిం కురు సర్వదా !!!

వాస్తుదేవా మేము నిర్మించబోవు గృహమునకు వంశాభివృద్ధి కళ్యాణ సౌభాగ్యములు, ఆయుఃఆరోగ్యములు సంపదలు కలిగించు తండ్రీ అని తప్పక పూజించ వలయును.

గృహము యొక్క గర్భము మూడు గజములు ఉండవలయును. అనగా 12'-00 పన్నెండు అడుగులు లోపల × లోపల ఉండునట్లు గర్భాయము పెట్టవలయును.

**ఆయము :** 12'-00", 18'-00", 24'-00", 30'-00", 36'-00" అడుగులు ఉండునట్లు చూడవలయును. అనగా 12'-00" అడుగులకు 6'-00" అడుగులు పెంచుకొంటూ పోవలయును. 12'-00" అడుగులుకు తక్కువ గర్భము ఉండరాదు.



**ద్వారములు – కిటికీలు**

సంఖ్య

1 ఉన్నయెడల శుభములు కలుగును
2 ఉన్నయెడల ఉత్తమము
3 ఉన్నయెడల మరణము కలుగను
4 ఉన్నయెడల లాభములు కలుగును
5 ఉన్నయెడల సంతాన నాశనము
6 ఉన్నయెడల సంతాన వృద్ధి
7 ఉన్నయెడల గృహమునకు అరిష్టము
8 ఉన్నయెడల సంపదలు కలుగను
9 ఉన్నయెడల పేరుప్రతిష్టకు భంగము కలుగును.
10 ఉన్నయెడల వంశనష్టము
11 ఉన్న యెడల అరిష్టము
12 ఉన్నయెడల పుత్రవృద్ధి, ధనలాభము
13 ఉన్నయెడల మృత్యుభయము, హాని
14 ఉన్నయెడల సంపదలు కలుగును.
15 ఉన్నయెడల దుఃఖము, అరిష్టము
16 ఉన్నయెడల పుత్రవృద్ధి, వంశాభివృద్ధి, అభివృద్ధి.


దూలములు, కిటికీలు మొదలగునవి ఏటికి అవే సరిసంఖ్యలో ఉండవలెను. మొత్తము కలిపి లెక్కించరాదు. వెన్నుకోసిన గృహములో నివసించరాదు. వెన్ను కోయరాదు.

**గృహములో నిద్రించునప్పుడు ఉండవలసిన జాగ్రత్తలు :**

దక్షిణము తలపెట్టి నిద్రించిన ధనలాభము, ఆరోగ్యము, కలుగును.
తూర్పు తల పెట్టి నిద్రించిన సాధన కర్తవ్యం, శుభము.
ఉత్తరము తలపెట్టి నిద్రించిన అనారోగ్యము, ఆయుక్షీణము, అశుభములు కలుగును.
వ్యాపారస్తులు దక్షిణము తలపెట్టి నిద్రించవలెను.
ఉద్యోగస్తులు తూర్పు తలపెట్టి నిద్రించవలెను.
వ్యవసాయదారులు పడమర తలపెట్టి నిద్రించవలెను
ఉత్తరము తలపెట్టి ఎవ్వరూ నిద్రించరాదు.
దంతధావనం ఉత్తర ముఖములో చేయవలయును.
ఉత్తర ముఖమున మల, మూత్ర విసర్జనలు చేయవలెను.
అంట్లు తోముట, బట్టలు ఉతుకుట లాంటి పనులు ఉత్తర ముఖము పెట్టి చేయవలెను.
దేవుని మందిరము ఈశాన్య భాగమునందే ఉండవలయును. నైఋతి భాగము నందు ఉన్న అనారోగ్యములు. భూత, ప్రేత ప్రవేశములు జరుగును.



# బాష్పాంజలి



జననం : 26-11-1947

మరణం 1-12-1995

మానవతా విలువలకు మరోరూపం...
నీతి నిజాయితీలకు నిలువుటద్దం....
దయ - ధర్మాలకు ప్రతిరూపం
మహోన్నత వ్యక్తిత్వం మన **సుబ్బరామన్నకే** సొంతం....

కీ॥శే॥ **మాగుంట సుబ్బరామరెడ్డి** గారు
(పార్లమెంటు మాజీ సభ్యులు, ఒంగోలు)

16వ వర్ధంతి సందర్భముగా వారి
పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ......

---

**తేది. 1-12-2011 గురువారం ఉ॥ గం॥ 10-00ల నుండి
ఒంగోలు పి.వి.ఆర్. మున్సిపల్ బాలుర హైస్కూలు ఆవరణలో
సంతాప సభ మరియు అన్నదాన కార్యక్రమము జరుగును.**



# తిరుక్కుఱళ్ - శ్రీవాణి

- డాక్టర్ గాలి గుణశేఖర్

ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి. సెల్ : 9618612495



## 17. పరుల సొమ్ము కోరమి

**171. పాడి దప్పి సొమ్ము పరుల దాశింపంగ కులము చెడును, నింద కలుగు భువిని**
న్యాయం విడిచి ఇతరుల సొమ్మును అపహరించాలని భావించే వాడి వంశం పతన మవుతుంది. అతడు నిందల పాలవుతాడు.

**172. పక్షపాతమునకు భయ మొందు సుజనుడు ఒరుల సొమ్ము గోరు ఓగు కాదు**
పక్షపాత బుద్ధితో ప్రవర్తించడానికి భయపడే సుగుణవంతుడు పరుల సంపదల్ని ఆశించే దుర్మార్గం తలపెట్టడు.

**173. ధర్మమున పరమానంద మర్మ మెరుగు వాడ ధర్మకార్యంబుల వీడు చుండు**
ధర్మమార్గంలో జీవించడం వల్ల పరమానందం పొందడం సాధ్యం. ఈ రహస్యం తెలిసిన మనిషి అధర్మ కార్యాలను ఆచరించడు.

**174. ఇంద్రియజితు డవని నిడుమల బడినను పరుల సంపదలను బడయ కుండు**
ఇంద్రియాలను జయించిన వాడు (ఇంద్రియ సుఖాలను పరిత్యజించిన వాడు) ఎన్ని ఇక్కట్లు ఎదురైనా తనది కాని సంపదల కోసం ఆరాటం చెందడు.

**175. పరుల సొమ్ము గోరు పాపి, ప్రాజ్ఞుడయిన అందువలన ఫలము నొందలేడు**
ఎంతటి వివేకి అయినా పరుల సొమ్మును ఆశిస్తే పాపాత్ముడవుతాడు. కనుక అతడి విజ్ఞత వల్ల కలిగే ఫలితాన్ని పొందలేడు.

**176. ధర్మపరుడైనను పరుల ధనము కోరి తగని పనులు తలచి నంత తవులు చేటు**
ధర్మంగా జీవించేవాడు ఇతరుల సొమ్మును ఆశించడు. కాని పొరపాటున అటువంటి తలపు వచ్చినంత మాత్రాన అతడు చేటును ఆహ్వానించిన వాడవుతాడు.

**177. పరుల సొమ్ము వలన పడయు పెంపు, ఫలిత మెంచు నపుడు కనికరించు టరిది.**
ఇతరుల సంపద వల్ల కలిగే అభివృద్ధిని ఆశించరాదు. అది ఫలితం ఇచ్చే సమయంలో ఆ ఫలితం అనుకూలంగా ఉండడం జరగదు.

**178. సిరులు తరుగ కుండ చెలగ వలె ననిన పరుల కలిమి కాశ పడగ రాదు**
తన సంపదలు నశించకుండా వృద్ధి చెందాలంటే, ఇతరుల సంపదల పట్ల ఉదాసీనంగా ఉండాలి. వాటిపై వ్యామోహం చెందరాదు.

**179. ధర్మ మెరిగి పరుల ధనము కోరని వాని చెంత జేరి లక్ష్మి సంతసిల్లు**
ధర్మం ఇది అని గ్రహించి, పరుల సొమ్మును ఆశించక జీవించడం వివేకవంతుల లక్షణం. వారి అర్హతను భావించి లక్ష్మి తనంతట తానే వచ్చి అనుగ్రహిస్తుంది.

**180. పరుల ధనము గోర పతనమ్ము దరి జేరు కోరకున్న జయము కోరి వచ్చు.**
ఇతరుల సొమ్మును ఆశించడం వల్ల అన్ని విధాల అనర్థం కలుగుతుంది. తనకున్న దానితో సంతృప్త జీవితాన్ని గడిపితే విజయం చేకూరుతుంది.

## 18. చాటున నిందింపమి

**181. ధర్మమెంచక చెడు చేయ తలపడినను కొండెములు పలుక దనుట మెందు కాదె?**
ధర్మాన్ని తన మనసులో నైనా తలపక చెడు చేసినా, ఎదుట లేని వ్యక్తుల గురించి నిందావాక్యాలు చెప్పక పోవడం ఉత్తమ లక్షణం.

**182. మంచి దూరి యధర్మము నెంచు కంటె వెనుక దూరి ముందు పొగడు విధము కీడు**
మంచిని నిందించి, అధర్మంగా ప్రవర్తించడం కంటె వ్యక్తి పరోక్షంలో అతణ్ని నిందించి, అతడు కన్పించి నప్పుడు ఇచ్చకపు మాటలతో కీర్తించడం దుర్మార్గం.

**183. చాటు మాట లాడి బ్రతుకు సాగదీయుట కంటె చావు మేలని నీతి శాస్త్రములు చాటు**
మనిషి లేనప్పుడు తూలనాడి బ్రతుకును కొనసాగించడం కంటె మరణించడమే ఉత్తమ మని నీతిశాస్త్రాలు నొక్కి చెబుతున్నాయి.

**184. పరుస మెదుర పలికినను, పలుక రాదు నింద; లేని మనుజు గూర్చి నిశ్చయముగ**
తన ఎదుట వ్యక్తిని తీవ్రమైన మాటలతో నిందించినా లేని వ్యక్తిని గురించి తప్పుగా మాట్లాడడం హేయమైన కార్యం.

**185. వెనుక నిందించు గుణమది విశద పరచు ధర్మ భావము తగదని తలచు విధము**
ఒక వ్యక్తికి ధర్మాన్ని తలచే హృదయం లేదని, అతడు పరోక్షంగా వ్యక్తుల్ని నిందించడం ద్వారా గ్రహించవచ్చు.

**186. ఒరుల దూరు వాడు పరులచే లోపము లెంచ బడుచు నింద గాంచు చుండు**
ఇతరులను చాటుగా నిందించే వాడు, అతడు వేసిన నిందలతో పరుల ద్వారా దూషించబడతాడు.

**187. అలరు భంగి నెయ్యమున పలుక లేని వాడు, నిందజేసి సఖుల వదిలి పెట్టు**
మనస్సు సంతోషించే విధంగా స్నేహభావంలో మాట్లాడలేనివాడు, నిందించి ఆత్మీయుల్ని పోగొట్టు కుంటాడు.

**188. ప్రియసఖుల గురించి పిరుద దూరు జనులు పరుల మంచి నెట్లు పలుక గలరు?**
తనకు అత్యంత సన్నిహితులను గూర్చి చాటుగా నిందించే వ్యక్తులు, ఇతరుల మంచిని గురించి చెప్పలేరు.

**189. తలప, దూరు వానిని కూడ దాల్ప ధర్మ మని భరించు చున్నదొ యేమొ అవని మాత**
తన ఎదుట లేని జనుల గురించి నిందించే కఠినాత్ముణ్ని కూడ భరించడం తనకు ధర్మమని భూమాత భావిస్తున్నదేమో! (అటువంటి వాణ్ని ఎలా భరిస్తున్నదని ఆశ్చర్యం)